ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక:89 | ఎడిటర్:మేనం శ్యామ్ | సోమవారం 19-10-2026 | పేజీలు: 10

సిరా చుక్క

దసరా పండుగనా..
మద్యం ప్రవాహమా?
దసరా వేళ పల్లెల్లో పండుగ సందడా..
మద్యం జోరా?
వైన్స్ నుంచి బెల్టు షాపులకు
భారీగా మద్యం తరలింపు!
కళ్లముందే అక్రమ విక్రయాలు..
అధికారుల మౌనం ఎందుకు?
నిబంధనలు ఉన్నా
అమలు చేసేవారే లేరా?
మద్యం మత్తులో
కుటుంబాలు చితికిపోవాలా?
పేదల బతుకుల్లో చిచ్చుపెట్టే
ఈ వ్యాపారానికి అడ్డుకట్ట ఏదీ?
ఎక్సైజ్ అధికారులు ఏం చేస్తున్నారు..
ప్రభుత్వాలు ఏం చూస్తున్నాయి?
బెల్టు షాపుల బరితెగింపుకు
ఇప్పటికైనా కళ్లెం వేయండి.

అరుణ్ రెడ్డి పన్నాల,
వికారాబాద్ జిల్లా బ్యూరో.

తెలంగాణలో బతుకమ్మ సంబరాలు
అంబరాన్ని తాకాయి

- పల్లెపల్లెనా పూల పండుగ సందడి
- ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ వేడుకలు
- ప్రత్యేక ఆకర్షణగా విజయ్ దేవరకొండ–రష్మిక జోడీ
- తెలంగాణ కోడలిగా వేడుకల్లో పాల్గొన్న రష్మిక
- పాటలు, కోలాటాలతో మహిళల సందడి

హైదరాబాద్, ప్రజా వాయిస్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా అంగరంగ వైభవంగా జరిగాయి. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఆడపడుచులంతా తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు, కోలాటాలతో పండుగను కన్నుల పండువగా జరుపుకున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా మహిళలు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మకు ఘనంగా వీడ్కోలు పలికారు.

ట్యాంక్‌బండ్‌పై ప్రత్యేక వేడుకలు

హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద రాష్ట్ర ప్రభుత్వం సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించింది. సినీ, రాజకీయ, కళా రంగాలకు చెందిన ప్రముఖులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. సినీ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జోడీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణ ఇంటి కోడలిగా రష్మిక బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.

విజయ్–రష్మికకు ఘన సన్మానం

బతుకమ్మ వేడుకలకు ఆహ్వానించగానే వచ్చిన విజయ్ దేవరకొండ, రష్మికలను రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి సీతక్క ఘనంగా సన్మానించారు. ప్రజలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని విజయ్ పేర్కొన్నారు. తెలంగాణ కోడలిగా బతుకమ్మ పండుగలో పాల్గొని అందరితో కలిసి ఆడిపాడటం అదృష్టంగా భావిస్తున్నానని రష్మిక తెలిపారు. ఈ వేడుకలకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు కూడా హాజరయ్యారు.

పల్లెల్లో పూల సందడి

రాష్ట్రంలోని ప్రతి పల్లెలోనూ బతుకమ్మ సంబరాలు వైభవంగా జరిగాయి. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, కొత్త పట్టు వస్త్రాలు ధరించి వాటిని ఎత్తుకుని వేడుకల ప్రాంగణాలకు చేరుకున్నారు. అనంతరం సంప్రదాయ పాటలు పాడుతూ, బతుకమ్మ ఆటలతో సందడి చేశారు. పల్లెలు, పట్టణాలు పూల సోయగాలతో ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. బతుకమ్మ పాటలు, డప్పుల మోతతో పండుగ వాతావరణం నెలకొంది. ముఖ్యంగా నల్గొండ, వరంగల్ జిల్లాల్లో వేడుకలు అంబరాన్నంటాయి. తెలంగాణ ఆడపడుచుల ఐక్యతను, ప్రకృతితో ముడిపడిన సంస్కృతిని చాటిచెప్పే బతుకమ్మ పండుగ రాష్ట్రవ్యాప్తంగా ఆనందోత్సాహాల మధ్య ముగిసింది.

హైదరాబాద్ మెట్రోకు అప్పుల సెగ

- ఆరు నెలల్లో రూ.406 కోట్ల నష్టం
- గతేడాదితో పోలిస్తే రూ.25.40 కోట్లు పెరిగిన నష్టాలు
- రూ.524.78 కోట్ల ఆదాయం
- రూ.930.64 కోట్లకు చేరిన వ్యయాలు
- వడ్డీల చెల్లింపులకే రూ.522.61 కోట్లు ఖర్చు
- మెట్రో నిర్వహణ వ్యయాలు రూ.222.88 కోట్లు
- రుణాల పునర్వ్యవస్థీకరణతో వడ్డీ భారం తగ్గించాలని ప్రభుత్వ యోచన
- ఎల్ అండ్ టీ నుంచి మెట్రో స్వాధీనంపై కొనసాగుతున్న ప్రతిష్టంభన

హైదరాబాద్, ప్రజా వాయిస్: హైదరాబాద్ మెట్రోరైలు ఆర్థిక కష్టాలు కొనసాగుతున్నాయి. ఆదాయం పెరుగుతున్నప్పటికీ వ్యయాలు మరింత అధికంగా ఉండటంతో నష్టాలు విస్తరిస్తున్నాయి. 2026 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో, అంటే ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు, మెట్రో రూ.405.86 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.380.46 కోట్ల నష్టంతో పోలిస్తే ఈసారి మరో రూ.25.40 కోట్లు పెరిగింది. ఎల్ అండ్ టీ నుంచి మెట్రోను స్వాధీనం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు ఈ పరిస్థితి సవాలుగా మారింది.

ఆదాయం పెరిగినా.. ఖర్చులదే పైచేయి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు

మిగతా 2లో

వెండి బతుకమ్మపై విమర్శలు

- ఘాటుగా బదులిచ్చిన పీవీ సింధు
- బతుకమ్మ వేడుకలను మిస్ అవుతున్నానంటూ గతేడాది ఫోటోలు పంచుకున్న స్టార్ షట్లర్
- వెండి బతుకమ్మను పట్టుకున్న ఫోటోపై నెటిజన్ విమర్శ
- సంప్రదాయం తెలియకుండా అభిప్రాయాలు చెప్పొద్దంటూ సింధు కౌంటర్
- రోజంతా కష్టపడి స్వయంగా పూల బతుకమ్మ పేర్చానని వెల్లడి
- అత్తగారి ప్రేమకు వెండి బతుకమ్మ నిదర్శనమని భావోద్వేగ స్పందన

2లో

మూడు బార్లు.. ముగ్గురు ఉన్నతాధికారులు..!

- మొయినాబాద్, చేవెళ్లలో మూడు మద్యం దుకాణాల లక్కీ డ్రా
- వ్యవస్థ ప్రాధాన్యతలపై ఆలోచనాత్మక ప్రశ్నలు!
- బార్లకు రాజయోగం.. సామాన్యుడికి సమస్యల భోగం
- కాసుల కోసం కదిలే పాలన వ్యవస్థ
- ప్రజల కంట కన్నీరు రానివ్వకుండా ఎప్పుడు కదులుతుంది?
- సామాన్యుడి సమస్యల పరిష్కారానికి కూడా ఇదే స్థాయిలో ప్రాధాన్యత ఎప్పుడు లభిస్తోంది?

మొయినాబాద్ (ప్రజావాయిస్): మొన్న మొయినాబాద్‌లో మూడు మద్యం దుకాణాల లక్కీ డ్రా సందర్భంగా కనిపించిన హడావుడి చూస్తుంటే సమాజం ఆలోచించాల్సిన ప్రశ్నలు ఎన్నో! తాగుడు షాపుల కోసం ఇంత ఆర్భాటమా? ఇంతమంది ఉన్నతాధికారుల హాజరా? ఇంతటి హంగామానా? ఇదే ఉత్సాహం ప్రజల సమస్యల పరిష్కారంలో కనిపిస్తే సమాజానికి ఎంత మేలు జరుగుతుంది?నిజానికి మద్యం షాపుల కేటాయింపు చట్ట ప్రకారం జరగాలి.. అందులో తప్పులేదు. పారదర్శకత ఉండాలి.. అదీ మంచిదే. శాంతిభద్రతల కోసం పోలీసులు పర్యవేక్షించాలి.. అదీ వాళ్ల విధే. కానీ

మిగతా 2లో

పండుగ వేళ పెను విషాదం

- థార్ ఢీకొని అన్నాచెల్లెళ్ల మృతి
- హయత్‌నగర్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
- అతివేగంగా వచ్చి స్కూటీని ఢీకొట్టిన కారు
- అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన నవీన్, రేఖ
- తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో నాలుగేళ్ల చిన్నారి
- డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

2లో

పండుగల వేళ నీటి కష్టాలకు చెక్

- జలమండలి ఐదు కీలక నిర్ణయాలు
- సీవరేజ్ పొంగిపొర్లకుండా ప్రత్యేక పర్యవేక్షణ
- నవంబర్ 1 నుంచి గ్రీన్ వాటర్ ట్యాంకర్ సేవలు
- అక్టోబర్ 20 నాటికి ఆన్‌లైన్ బుకింగ్ వేదిక సిద్ధం
- అదనంగా 500 ట్యాంకర్ల నమోదుకు చర్యలు
- మురుగునీటి శుద్ధి నాణ్యత పెంపునకు నెల రోజుల గడువు

హైదరాబాద్, ప్రజా వాయిస్: పండుగల సీజన్‌లో నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఎదురుకాకుండా, మురుగునీటి కాలువలు పొంగిపొర్లకుండా హైదరాబాద్ జలమండలి ముందస్తు చర్యలకు సిద్ధమైంది. ఈ మేరకు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి ఆదివారం అధికారులతో సమీక్ష నిర్వహించి ఐదు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పెరుగుతున్న నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ట్యాంకర్ల సంఖ్య పెంపు, శుద్ధి చేసిన మురుగునీటి వినియోగం, శుద్ధి కేంద్రాల నాణ్యత మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించారు.

సీవరేజ్ సమస్యలపై ప్రత్యేక నిఘా

పండుగల సమయంలో ప్రధాన రహదారులు, ఉత్సవాలు జరిగే ప్రాంతాల్లో మురుగునీరు రోడ్లపైకి రాకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని అధికారులు ఆదేశించారు. మ్యాన్‌హోళ్లు, మురుగునీటి పైపులైన్లను ముందుగానే తనిఖీ చేసి సమస్యాత్మక ప్రాంతాల్లో నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించేలా అవసరమైన సిబ్బంది, యంత్రాలను సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు.

నవంబర్ 1 నుంచి గ్రీన్ వాటర్ ట్యాంకర్లు

తాగునీరు అవసరం లేని నిర్మాణ పనులు, తోటల పెంపకం, పార్కుల నిర్వహణ వంటి అవసరాలకు శుద్ధి చేసిన మురుగునీటిని అందించేందుకు గ్రీన్ వాటర్ ట్యాంకర్ సేవలను ప్రారంభించనున్నారు. నవంబర్ 1 నుంచి ఈ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ట్యాంకర్ల నమోదు, ఏకరీతి గుర్తింపు, నీరు నింపే కేంద్రాల అభివృద్ధిపై దృష్టి సారించారు. వినియోగదారులు ఆన్‌లైన్‌లో ట్యాంకర్లను బుక్ చేసుకునేలా అక్టోబర్ 20 నాటికి డిజిటల్ వేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు.

శుద్ధి కేంద్రాల నాణ్యతకు మెరుగులు

మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో ప్రమాణాలకు అనుగుణంగా నీటి శుద్ధి జరిగేలా చర్యలు చేపట్టనున్నారు. నాణ్యతలో లోపాలున్న కేంద్రాల్లో సాంకేతిక మార్పులు చేయడంతో పాటు అవసరమైన చోట అదనపు వడపోత పరికరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నెల రోజుల్లో శుద్ధి చేసిన నీటి నాణ్యతను మెరుగుపరిచేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు.

ఫిల్లింగ్ కేంద్రాలు, ట్యాంకర్ల పెంపు

ప్రస్తుతం ఉన్న నీటి నింపే

మిగతా 2లో

మాజీ డీజీపీ భార్య హత్య కేసులో కీలక మలుపు

- తనూజ హత్య కేసులో నలుగురు నేపాలీ ముఠా సభ్యులు అదుపులోకి
- ప్రధాన నిందితురాలిగా ఇంటి పనిమనిషి కల్పన
- మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని పోలీసుల విచారణ
- బంగారు ఆభరణాలతో ముఠా పరారైనట్లు అనుమానం
- నేపాల్‌లో మరో ముగ్గురి కోసం తెలంగాణ ప్రత్యేక బృందం గాలింపు

2లో

పండుగల వేళ నీటి కష్టాలకు చెక్

మొదటి పేజీ తరువాయి

కేంద్రాల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయాలని జలమండలి నిర్ణయించింది. ప్రతి కేంద్రంలో మీటర్లు ఏర్పాటు చేసి నీటి సరఫరా వివరాలను నమోదు చేయాలని ఆదేశించింది. ఈ ప్రక్రియలో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, హైడ్రా వంటి సంస్థలతో సమన్వయం చేసుకోవాలని సూచించింది.ప్రస్తుతం ఉన్న సుమారు 1,200 ట్యాంకర్లకు అదనంగా మరో 500 ట్యాంకర్లను నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బోడుప్పల్ వంటి ప్రాంతాల్లో పెండింగ్ బుకింగ్‌లను తగ్గించేందుకు ప్రత్యేకంగా మరో 50 ట్యాంకర్లను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

వేసవి సమస్యలు పునరావృతం కాకుండా ప్రణాళిక

నగరంలో జనాభా పెరుగుదలతో నీటి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో గత వేసవిలో ఎదురైన ఇబ్బందులు మళ్లీ తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని ఎండీ స్పష్టం చేశారు. గ్రీన్ వాటర్ వినియోగం పెరిగితే తాగునీటిపై ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని, లీకేజీలు గుర్తిస్తే వెంటనే జలమండలికి సమాచారం అందించాలని సూచించారు. నిర్ణయాల అమలు ఎంత సమర్థంగా జరుగుతుందనే దానిపై నగర నీటి సరఫరా, మురుగునీటి నిర్వహణలో మార్పులు ఆధారపడి ఉంటాయి.

హైదరాబాద్ మెట్రోకు అప్పుల సెగ

మొదటి పేజీ తరువాయి

నెలల్లో మెట్రోకు రూ.524.78 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఏడాది ఇదే కాలంలో వచ్చిన రూ.497.54 కోట్లతో పోలిస్తే ఆదాయం రూ.27.24 కోట్లు పెరిగింది. అయితే నిర్వహణ, ఉద్యోగుల జీతభత్యాలు, పరిపాలనా వ్యయాలు, తరుగుదల, రుణాలపై వడ్డీలు తదితర ఖర్చులు కలిపి మొత్తం వ్యయాలు రూ.930.64 కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో ఈ వ్యయాలు రూ.878 కోట్లుగా ఉన్నాయి. ఆదాయం పెరుగుదల వ్యయాల భారాన్ని అధిగమించలేకపోవడంతో నష్టాలు కొనసాగుతున్నాయి.

వడ్డీలకే రూ.522 కోట్లకు పైగా

మెట్రో ఆర్థిక పరిస్థితిని రుణాలపై వడ్డీ భారం తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. తొలి ఆరు నెలల్లోనే ఫైనాన్స్ ఖర్చులు రూ.522.61 కోట్లుగా నమోదయ్యాయి. మెట్రో రైళ్ల నిర్వహణకు సంబంధించిన వ్యయాలు రూ.222.88 కోట్లుగా ఉన్నాయి. ప్రాజెక్టు కోసం తీసుకున్న రుణాలపై ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో సగటున 7 నుంచి 8 శాతం వరకు వడ్డీ చెల్లిస్తున్నట్లు సమాచారం. దీంతో ఆదాయంలో గణనీయమైన భాగం వడ్డీలకే వెచ్చించాల్సి వస్తోంది.

రుణాల పునర్వ్యవస్థీకరణపై ప్రభుత్వం దృష్టి

మెట్రోను స్వాధీనం చేసుకున్న తర్వాత రుణాలను పునర్వ్యవస్థీకరించి వడ్డీ భారాన్ని తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. వడ్డీ రేట్లను 3.5 నుంచి 4 శాతం లోపునకు తీసుకురాగలిగితే ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని అంచనా వేస్తోంది. తక్కువ వడ్డీ రేట్లకు రుణాలను పునర్వ్యవస్థీకరించేందుకు ముందుకొచ్చే బ్యాంకుల అన్వేషణ బాధ్యతను ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించినట్లు సమాచారం.

స్వాధీన ప్రక్రియపై ఉత్కంఠ

మెట్రో మొదటి దశ ప్రాజెక్టును ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకునే ప్రక్రియలో ఇంకా ప్రతిష్టంభన కొనసాగుతోంది. రుణాల పునర్వ్యవస్థీకరణతో పాటు నిర్వహణ వ్యయాల నియంత్రణ, ఆదాయ మార్గాల విస్తరణ కీలకంగా మారాయి. రుణాలపై వడ్డీ భారాన్ని తగ్గించడంలో ఎంతవరకు విజయం సాధిస్తారు, స్వాధీన ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుంది అనే అంశాలపై మెట్రో భవిష్యత్తు ఆధారపడి ఉంది.

మూడు బార్లు.. ముగ్గురు ఉన్నతాధికారులు..!

మొదటి పేజీ తరువాయి

అసలు కథ అక్కడితో అయిపోతుందా? ఆ మద్యం షాపుల వల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కనిపిస్తోంది.. మరి మందు మత్తులో అప్పుల పాలయ్యే కుటుంబాల కన్నీళ్లు ఎవరికైనా కనిపిస్తున్నాయా? మూడు మద్యం దుకాణాల కేటాయింపు కార్యక్రమానికి ఇంతటి ప్రాధాన్యత లభిస్తున్నప్పుడు.. ప్రజల జీవితాలను ప్రభావితం చేసే సమస్యలకు కూడా ఇదే స్థాయి ప్రాధాన్యత దక్కుతోందా?మద్యం కారణంగా కుటుంబాల్లో చెలరేగే కలహాలు, అప్పుల బాధలు, ఆరోగ్య సమస్యలు, మహిళల కన్నీళ్లు, పిల్లల భవిష్యత్తుపై పడే ప్రభావం.. వీటిపై సమాజం ఎంతగా ఆలోచిస్తోంది?ఒకవైపు మద్యం వ్యాపారానికి సంబంధించి దుకాణాల కేటాయింపులు పకడ్బందీగా జరుగుతున్నాయి. మరోవైపు మద్యపాన వ్యసనంతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు కౌన్సెలింగ్, అవగాహన, పునరావాసం వంటి సేవలు కూడా అంతే శ్రద్ధతో అందుతున్నాయా? అన్నది చర్చించాల్సిన అంశం.

అధికారుల హాజరు ఒక విధి.. సమాజంపై బాధ్యత మరో విధి!

అదనపు కలెక్టర్ కిరణ్మయి, డీసీపీ యోగేష్ గౌతమ్, జిల్లా డిప్యూటీ కమిషనర్ రఘురాం హాజరయ్యారని విమర్శించడం ఈకథనం ఉద్దేశం కాదు. చట్టబద్ధమైన ప్రక్రియలో అధికారుల పాత్రను ప్రశ్నించడం కూడా కాదు. కానీ ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, సామాజిక పెద్దలు కలిసి ప్రజా సంక్షేమానికి కూడా ఇంతటి ప్రాధాన్యత ఇవ్వాలన్నదే అసలు సందేశం.గ్రామాల్లో రోడ్ల సమస్యలు, యువతలో నిరుద్యోగం, పేదల వైద్య ఖర్చులు, విద్యార్థుల చదువులు, మహిళల భద్రత వంటి అంశాలపై జరిగే కార్యక్రమాలకూ ఇదే స్థాయిలో శ్రద్ధ కనిపిస్తే ప్రజాస్వామ్యంపై ప్రజలకు మరింత నమ్మకం పెరుగుతుంది.

సమాజం నేర్చుకోవాల్సిన పాఠం ఏమిటి?

సమాజంలో నాయకులు, అధికారులు, ప్రజా జీవితంలో ఉన్న ప్రముఖులు చేసే ప్రతి చర్యను ప్రజలు ఒకే కోణంలో చూడరు. వారి హాజరు చట్టబద్ధమైన కార్యక్రమంలో భాగమైనప్పటికీ, దానికి లభించే ప్రచారం ప్రజల్లో ఎలాంటి సందేశాన్ని కలిగిస్తోందన్న అంశం కూడా చర్చకు వస్తుంది.అందుకే ప్రశ్న వ్యక్తుల గురించి కాదు.. వ్యవస్థ ప్రాధాన్యతల గురించి కావాలి. మద్యం దుకాణాల కేటాయింపులో కనిపించే క్రమశిక్షణ, పారదర్శకత.. ప్రజా ఆరోగ్య పరిరక్షణలోనూ కనిపించాలి. ఆదాయ సమీకరణలో కనిపించే ప్రణాళిక.. వ్యసనాల నివారణలోనూ కనిపించాలి. చట్ట అమలులో కనిపించే అప్రమత్తత.. మహిళలు, పిల్లలు, బాధిత కుటుంబాల రక్షణలోనూ ప్రతిఫలించాలి. సమాజం అభివృద్ధి చెందిందని చెప్పుకోవడానికి ఆదాయం పెరగడం ఒక్కటే కొలమానం కాదు. ఆ ఆదాయం వెనుక ప్రజల జీవన ప్రమాణాలు ఎలా మారుతున్నాయన్నదీ అంతే ముఖ్యమైన కొలమానం. అందుకే ఒక సమాజం గొప్పదవ్వాలంటే దాని ఖజానా నిండితే సరిపోదు.. పేదవాడి ఇల్లు కూడా వెలగాలి. అధికార యంత్రాంగం చురుగ్గా పనిచేస్తే సరిపోదు.. ఆ చురుకుదనం సామాన్యుడి కన్నీరు తుడిచే దిశగా సాగాలి. ప్రభుత్వానికి ఆదాయం పెరిగితే సరిపోదు.. ఆ ఆదాయం వెనుక ప్రజల జీవితాలు మరింత భద్రంగా, ఆరోగ్యంగా, గౌరవప్రదంగా మారాలి.

దాండియా వేడుకల్లో మృత్యుఘోష

- లైటింగ్ కూలి ఇద్దరు విద్యార్థుల మృతి
- నాదర్‌గుల్ ఎంవీఎస్ఆర్ కళాశాలలో విషాదం
- గాలివానకు కూలినట్లు ప్రాథమిక సమాచారం
- మరో 15 మందికి గాయాలు.. ఆసుపత్రికి తరలింపు
- మృతుల్లో వనపర్తికి చెందిన బీటెక్ విద్యార్థిని సోనీ
- ఘటనపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి.. పోలీసుల దర్యాప్తు

హైదరాబాద్, ప్రజా వాయిస్: దసరా పండుగ వేళ హైదరాబాద్ శివారులోని నాదర్‌గుల్ ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కళాశాలలో నిర్వహించిన దాండియా వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన లైటింగ్ వ్యవస్థ కూలిపోవడంతో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. మరో 15 మంది గాయపడినట్లు ఆదిబట్ల పోలీసులు తెలిపారు. వేడుకల కోసం పెద్దఎత్తున ఏర్పాట్లు చేసిన ప్రాంగణంలో ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో విద్యార్థులు, కళాశాల సిబ్బంది ఆందోళనకు గురయ్యారు.

గాలివానతో కూలిన లైటింగ్ వ్యవస్థ

పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. రాత్రి సమయంలో ఒక్కసారిగా గాలివాన రావడంతో దాండియా కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన లైటింగ్ వ్యవస్థ కూలిపోయింది. ఈ ఘటనలో పలువురు విద్యార్థులు దాని కింద చిక్కుకుని గాయపడ్డారు. వనపర్తికి చెందిన సోనీ అనే బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థిని మృతి చెందినట్లు గుర్తించారు. మరో విద్యార్థి వివరాలు తెలియాల్సి ఉంది. సోనీ సోదరికి కూడా తీవ్ర గాయాలైనట్లు సమాచారం. ఆమెను మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.

కామినేని ఆసుపత్రికి క్షతగాత్రులు

ప్రమాదం జరిగిన వెంటనే ఆదిబట్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన విద్యార్థులను సమీప ఆసుపత్రులకు తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు.

సీఎం దిగ్భ్రాంతి.. విద్యార్థి సంఘాల ఆందోళన

ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు ప్రమాదంపై ఆగ్రహం వ్యక్తం చేసిన విద్యార్థి సంఘాలు కళాశాలలో నిరసన చేపట్టాయి. ఆందోళన సందర్భంగా ఫర్నీచర్ ధ్వంసమైనట్లు సమాచారం.

ప్రమాదానికి కారణాలపై విచారణ

ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆదిబట్ల పోలీసులు తెలిపారు. లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు, భద్రతా ఏర్పాట్లు, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై విచారణ జరుపుతున్నారు. పండుగ వేడుకల్లో చోటుచేసుకున్న ఈ ఘటన విద్యార్థుల భద్రతపై పలు ప్రశ్నలను లేవనెత్తింది.

పండుగ వేళ పెను విషాదం

హైదరాబాద్, ప్రజా వాయిస్: పండుగ పూట ఓ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. దసరా పండుగకు స్వగ్రామానికి వెళ్తున్న అన్నాచెల్లెళ్లు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై హయత్‌నగర్ సమీపంలో వేగంగా దూసుకొచ్చిన థార్ కారు స్కూటీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన నవీన్, రేఖ అక్కడికక్కడే మృతి చెందారు. వారితో ఉన్న నాలుగేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడింది.

దసరాకు ఇంటికి వస్తుండగా ప్రమాదం

రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన నవీన్, రేఖ అన్నాచెల్లెళ్లు. దసరా పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులతో గడిపేందుకు స్కూటీపై బయలుదేరారు. ఈ క్రమంలో హయత్‌నగర్ సమీపానికి చేరుకోగానే వేగంగా వచ్చిన థార్ కారు వారి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో నవీన్, రేఖ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. వారితో ఉన్న నాలుగేళ్ల చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి.

చిన్నారి పరిస్థితి విషమం

ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన చిన్నారిని సమీప ఆసుపత్రికి తరలించారు. చిన్నారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో బాధిత కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. వారి స్వగ్రామంలోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి.

డ్రైవర్ అదుపులో.. ట్రాఫిక్ పునరుద్ధరణ

సమాచారం అందుకున్న హయత్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన థార్ కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ప్రమాదం కారణంగా విజయవాడ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు చర్యలు చేపట్టి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. పండుగ వేళ జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

మాజీ డీజీపీ భార్య హత్య కేసులో కీలక మలుపు

హైదరాబాద్, ప్రజా వాయిస్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ వినయ్ రంజన్ రాయ్ సతీమణి తనూజ హత్య కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో నలుగురు నేపాలీ ముఠా సభ్యులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. వీరిలో తనూజ ఇంట్లో పనిమనిషిగా పనిచేసిన కల్పనతో పాటు మరో ముగ్గురు ఉన్నట్లు తెలుస్తోంది.

మే 8న హత్య.. ఆభరణాలతో పరారీ

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్రశాసన్ నగర్‌లో ఉన్న తన నివాసంలో తనూజ ఈ ఏడాది మే 8న హత్యకు గురయ్యారు. ఇంట్లో పనిమనిషిగా పనిచేస్తున్న కల్పన ఈ ఘటనలో కీలక నిందితురాలిగా అనుమానిస్తున్నారు. హత్య అనంతరం బంగారు ఆభరణాలతో కల్పనతో కూడిన ముఠా పరారైనట్లు పోలీసులు భావిస్తున్నారు.

ఆరు నెలలుగా ప్రత్యేక బృందాల గాలింపు

ఈ కేసులో నిందితుల కోసం గత ఆరు నెలలుగా తెలంగాణ పోలీసుల ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. తాజాగా నలుగురిని అదుపులోకి తీసుకోవడంతో దర్యాప్తులో పురోగతి లభించినట్లు తెలుస్తోంది. మరో ముగ్గురు నిందితులు నేపాల్‌లో ఉన్నట్లు అనుమానిస్తూ, వారి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలుగాలింపు చేపట్టినట్లు సమాచారం

విచారణలో కీలక వివరాలపై ఆరా

అదుపులో ఉన్న నిందితులను పోలీసులు విచారిస్తూ హత్యకు దారితీసిన పరిస్థితులు, ఆభరణాల ఆచూకీ, పరారీలో ఉన్న వారి పాత్రపై వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే నిందితుల అరెస్టు, కేసులో వారి పాత్రకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

తాగునీరు వృథా చేస్తే కనెక్షన్ కట్

- పబ్‌కు రూ.20 వేల జరిమానా
- సూపర్ ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యతపై ఆందోళనలు
- జూబ్లీహిల్స్ పబ్‌పై జలమండలి చర్యలు
- నిర్మాణ పనులకు తాగునీరు వినియోగిస్తున్నట్లు ఫిర్యాదు
- జరిమానాతో పాటు నీటి కనెక్షన్ తొలగింపు
- వాణిజ్య ట్యాంకర్ల సరఫరా కూడా నిలిపివేత
- నీటి వృథాపై ఫొటోలు, వీడియోలతో ఫిర్యాదు చేయాలని సూచన

హైదరాబాద్, ప్రజా వాయిస్: నగరంలో తాగునీటి వృథాను అరికట్టేందుకు హైదరాబాద్ జలమండలి కఠిన చర్యలకు దిగింది. తాగునీటిని దుర్వినియోగం చేస్తే జరిమానాలు విధించడంతో పాటు నీటి కనెక్షన్లు నిలిపివేస్తామని హెచ్చరించింది. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లోని ఫోర్ ఫాదర్స్ పబ్‌పై చర్యలు తీసుకుంది. తాగునీటిని వృథా చేస్తున్నారనే ఫిర్యాదుతో తనిఖీలు నిర్వహించిన అధికారులు.. రూ.20 వేల జరిమానా విధించి, నీటి కనెక్షన్‌ను తొలగించారు. వాణిజ్య నీటి ట్యాంకర్ల సరఫరాను కూడా నిలిపివేసినట్లు సమాచారం.

నిర్మాణ పనులకు తాగునీరు వినియోగించినట్లు ఫిర్యాదు

పబ్ ప్రాంగణంలో నిర్మాణ పనుల కోసం తాగునీటిని వినియోగిస్తున్నట్లు జలమండలికి ఫిర్యాదు అందింది. దీంతో అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు చేపట్టారు. హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లు, ఇతర వాణిజ్య సముదాయాలు తాగునీటిని దుర్వినియోగం చేస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అవసరమైతే నీటి సరఫరా నిలిపివేస్తామని హెచ్చరించారు.

వేసవికి ముందే నీటి పొదుపుపై దృష్టి

తక్కువ వర్షపాతం, భూగర్భ జలమట్టాల తగ్గుదల నేపథ్యంలో రానున్న వేసవిలో నీటి లభ్యతపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించాలని ప్రజలకు సూచిస్తున్నారు. వాహనాల శుభ్రత, నిర్మాణ పనులు, ఇతర అవసరాల కోసం తాగునీటిని వృథా చేయకుండా ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని కోరుతున్నారు.

వృథా కనిపిస్తే వాట్సాప్‌లో ఫిర్యాదు చేయండి

నగరంలో ఎక్కడైనా తాగునీటి వృథా కనిపిస్తే ఫొటోలు లేదా వీడియోలు తీసి జలమండలి వాట్సాప్ నంబర్ 99499 30003 కు పంపించాలని అధికారులు సూచించారు. పండుగల సమయంలో నీటికి డిమాండ్ పెరిగే నేపథ్యంలో ప్రజలు, వాణిజ్య సంస్థలు బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. నీటి వృథాను అరికట్టేందుకు ప్రజల సహకారం అవసరమని జలమండలి స్పష్టం చేసింది.

కరువు కష్టాలకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

- విద్యుత్తు, సాగునీరు ఎలా అందించాలో మాకు తెలుసు
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

ప్రజా వాయిస్, సూర్యాపేట: రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రులు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అవినీతి, కమీషన్లకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులపై ఆయన మీడియాతో మాట్లాడారు.తెలంగాణలో కృష్ణా జలాలను ఇప్పటివరకు 18 టీఎంసీలు కూడా వినియోగించుకోలేదని, రాష్ట్రానికి రావాల్సిన నీటిని సద్వినియోగం చేసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని జగదీశ్‌రెడ్డి అన్నారు. కన్నెపల్లి పంపుహౌస్‌ను ప్రారంభించి ఉంటే రాష్ట్రంలోని చెరువులు, ప్రాజెక్టులు నీటితో నిండేవని పేర్కొన్నారు. గోదావరి నుంచి 250 టీఎంసీల నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

కాళేశ్వరంతో తెలంగాణ సస్యశ్యామలం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణలో సాగునీటి సౌకర్యాలు మెరుగుపడ్డాయని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని వాతావరణ నిపుణులు ఏడాది ముందుగానే హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రస్తుత కరువు పరిస్థితులకు ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని విమర్శించారు. సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులను వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

విద్యుత్తు, సాగునీరు అందించడంలో విఫలం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరంతర విద్యుత్తు సరఫరా చేశామని, ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్తు, సాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని జగదీశ్‌రెడ్డి అన్నారు. యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం విషయంలో ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు అవాస్తవమని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం ఉంటే చర్యలు తీసుకోవాల్సిందిపోయి ఉద్యోగులను బలిపశువులను చేసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ప్రైవేటు బొగ్గు సంస్థల నుంచి కమీషన్ల కోసం సింగరేణి సంస్థను అప్రతిష్ఠపాలు చేస్తున్నారని ఆరోపించారు.

మాకు అప్పగిస్తే చేసి చూపిస్తాం

తెలంగాణ వనరులను ఇతర రాష్ట్రాల ప్రయోజనాల కోసం వినియోగిస్తూ ఇక్కడి రైతులకు అన్యాయం చేస్తున్నారని జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. విద్యుత్తు, సాగునీటిని అందించడంలో ప్రభుత్వానికి చేతకాకపోతే తమకు అప్పగించాలని, వాటిని ఎలా అందించాలో చేసి చూపిస్తామని సవాల్ విసిరారు. ప్రజలు, ఉద్యోగులు, అన్ని రంగాల వారు ప్రభుత్వ వైఫల్యాలను గమనిస్తున్నారని అన్నారు. కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తే రాష్ట్రంలో విద్యుత్తు, సాగునీటి వ్యవస్థలను పూర్వస్థితికి తీసుకువచ్చే సామర్థ్యం తమకు ఉందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వెండి బతుకమ్మపై విమర్శలు

హైదరాబాద్, ప్రజా వాయిస్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగపై భారత స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ ఏడాది బతుకమ్మ వేడుకలను చాలా మిస్ అవుతున్నానంటూ గతేడాది తన భర్తతో కలిసి పండుగ జరుపుకున్న ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. అయితే, ఓ ఫొటోలో వెండితో చేసిన బతుకమ్మను పట్టుకుని ఉండటంపై ఓ నెటిజన్ విమర్శించగా.. సింధు తనదైన శైలిలో సమాధానమిచ్చారు.

సంప్రదాయం తెలుసుకుని మాట్లాడండి

పూలతో బతుకమ్మను పేర్చుతారని, వెండి బతుకమ్మతో పండుగ జరుపుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఓ నెటిజన్ వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన సింధు.. ఏదైనా అభిప్రాయానికి వచ్చే ముందు సంప్రదాయాన్ని అర్థం చేసుకోవాలని హితవు పలికారు. తన పుట్టింటి వైపు బతుకమ్మ పండుగను జరుపుకునే ఆచారం లేదని, పెళ్లి తర్వాత తెలంగాణ సంప్రదాయాలను తెలుసుకుని ఈ వేడుకలో పాల్గొన్నానని వివరించారు.

రోజంతా శ్రమించి పూల బతుకమ్మ

తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన కుటుంబంలోకి కోడలిగా వెళ్లిన తర్వాత తనకు బతుకమ్మ పండుగ ప్రత్యేకంగా మారిందని సింధు పేర్కొన్నారు. ఫొటోలో వెనుక కనిపిస్తున్న పెద్ద పూల బతుకమ్మను తానే స్వయంగా పేర్చానని, దాని కోసం రోజంతా సమయం కేటాయించానని వెల్లడించారు. ఎంతో ఇష్టంగా పూలను పేర్చి కుటుంబంతో కలిసి పండుగ జరుపుకున్నట్లు తెలిపారు.

అత్తగారి ప్రేమకు గుర్తుగా వెండి బతుకమ్మ

తాను చేతిలో పట్టుకున్న వెండి బతుకమ్మను తనకు ఆత్మీయమైన సంప్రదాయంలోకి ఆహ్వానిస్తూ అత్తగారు చూపించిన ప్రేమకు గుర్తుగా అభివర్ణించారు. సంప్రదాయంతో పాటు కుటుంబ సభ్యుల ప్రేమకు కూడా పండుగలో చోటు ఉంటుందని సింధు భావోద్వేగంగా స్పందించారు.

తెలంగాణ పూల పండుగను మిస్ అవుతున్నా

ప్రకృతితో మమేకమై, రంగురంగుల పూలతో జరుపుకునే బతుకమ్మ పండుగ తనకు ఎంతో ప్రత్యేకమని సింధు గతంలో పేర్కొన్నారు. పూల అందాలు, వేడుకల సందడి, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఈ ఏడాది మిస్ అవుతున్నానని తెలిపారు. పండుగకు దూరంగా ఉన్నప్పటికీ తన మనసంతా తెలంగాణ పూల పండుగ చుట్టూనే ఉందనే భావనను ఆమె తన పోస్టు ద్వారా వ్యక్తం చేశారు.

విధి నిర్వహణలో అప్రమత్తతే ముఖ్యం

ఘనంగా అగ్రి వర్సిటీ సెక్యూరిటీ యూనియన్ ఆయుధ ముఖ్య ఆహ్వానితులుగా పాల్గొన్న,ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్,గణేష్ గుప్తా భద్రతా బాధ్యతల్లో క్రమశిక్షణ,అంకితభావం కీలకమని హితవు

ప్రజావాయిస్// రాజేంద్రనగర్: విధి నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యానికి తావివ్వకుండా అప్రమత్తంగా ఉండాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ. ప్రకాశ్ గౌడ్ అగ్రి వర్సిటీ సెక్యూరిటీ గార్డులకు సూచించారు.ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ సెక్యూరిటీ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయుధ పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గణేష్ గుప్తా ముఖ్య ఆహ్వానితులుగా పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన పూజల్లో పాల్గొని సెక్యూరిటీ సిబ్బందికి ముందస్తుగా దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సెక్యూరిటీ గార్డులను ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ..వర్సిటీకి వచ్చే విద్యార్థులు,బోధన, బోధనేతర సిబ్బంది, సందర్శకుల భద్రతను కాపాడటంలో సెక్యూరిటీ గార్డుల బాధ్యత కీలకమని అన్నారు.ప్రతి క్షణం అప్రమత్తంగా ఉంటూ, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని సూచించారు.విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ,ఎలాంటి పరిస్థితులనైనా సమర్థంగా ఎదుర్కొనేలా సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. భద్రత విషయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా సమస్యలకు దారితీసే అవకాశం ఉన్నందున నిరంతర అప్రమత్తత అవసరమని తెలిపారు.ఆయుధ పూజ సందర్భంగా సెక్యూరిటీ గార్డులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ,వారు విధుల్లో సురక్షితంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్,నజీర్ సార్,సెక్యూరిటీ ఆఫీసర్ సూర్యనారాయణ, సెక్యూరిటీ సంఘం అధ్యక్షుడు దుబ్బ సన్నీ, ఎస్.రామచందర్,వై. నరసింహ,ఎం.బాలయ్య, ఎం.హరికృష్ణ,ఏ.దశరథ్,డి.కృష్ణ,సి.నరసింహ,ఈ. యాదయ్య,ఏ.రవి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లి ఒడిలో....గౌరమ్మ..

- అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు
- బోజేర్వు లో ఘనంగా బతుకమ్మ వేడుకలు
- ఆకట్టుకున్న మహిళల ఆట పాటలు,యువతుల కోలాటాలు

ప్రజా వాయిస్,వరంగల్ చెన్నారావుపేట : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన సద్దుల పండుగ వేడుకలు బోజేర్వు లో గురువారం ఘనంగా జరిగాయి.మహిళలు ఉదయాన్నే రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, ప్రత్యేక పూజలు చేశారు.సాయంత్రం వేళ బతుకమ్మలంటిని ఒక చోట చేర్చి. చుట్టూరా తిరుగుతూ బతుకమ్మ ఆట పాటలు జరుపుకున్నారు. యువతుల దాండియా నృత్యాలు ఎంతో ఆకర్షలుగా నిలిచాయి. బతుకమ్మ ప్రత్యేకత కావడంతోఅత్తారింట్లో ఉన్న ఆడపడుచులు. సొంత ఊరికి చేరుకొని,కుటుంబ సభ్యుల మధ్య సంతోషంగా వేడుక లను జరుపుకున్నారు. అనంతరం బతుకమ్మలను చేత పట్టుకొని నిమజ్జనం చేసి గ్రామల మహిళ లంతా బతుకమ్మలతో ఒక చోట వేరడంతో పూలమాణాన్ని తలపించింది.చెన్నారావుపేట మండలం జరిగిన బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. బతుకమ్మ వేడుకల కోసం.గంగమ్మ తల్లి ఒడిలో గౌరమ్మ... మండల గ్రామపంచాయతీలలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూసంగా 9 రోజులకి.సద్దుల బతుకమ్మను వేడుకలను నిర్వహి స్తారు.తెలంగాణలోని సంస్కృతిని నాగరికతను బతుకమ్మను బ్రతికించుకోవాల్సిన అవసరం ఎంతైనా రైతులు క్షేమంగా సమృద్ధిగా పండి పంటలు చల్లగా ఉండాలని కోరారు.

ఆలయాల అభివృద్ధికి రూ.2,500 కోట్లు

- భద్రాచలం అభివృద్ధికి రూ.276 కోట్లు
- బాసర ఆలయానికి రూ.354 కోట్లు
- ప్రజా సంక్షేమమే మా అజెండా
- ప్రతి కుటుంబం బాగుండటమే లక్ష్యం
- రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు
- నాచారం ఆలయానికి రూ.44 కోట్లతో రహదారి
- సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా
- విద్యార్థుల భవిష్యత్తే మన రాష్ట్ర భవిష్యత్తు
- మరో బీటీ రోడ్డు మంజూరుకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క హామీ

ఏన్కూరు, ప్రజా వాయిస్: రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గం ఏన్కూరు మండలం నాచారంలోని అద్భుత వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఆయన, ఆలయానికి వెళ్లే రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయానికి భవిష్యత్తులో లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రూ.44 కోట్లతో రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే రామదాసు నాయక్ పట్టుదలతో ఈ రహదారికి నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రహదారి నిర్మాణంతో భక్తులకు సౌకర్యం కలగడమే కాకుండా స్థానికంగా వ్యాపారాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి సుమారు రూ.2,500 కోట్లతో పనులు చేపడుతున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతాలు, అక్కడి ఆలయాల అభివృద్ధికి రూ.2,000 కోట్లను ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రూ.276 కోట్లు, బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.354 కోట్లు కేటాయించినట్లు వివరించారు.

సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా.

. ప్రజల కుటుంబ అవసరాలను తీర్చడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని ఉప ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో 1.06 కోట్ల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం, 71 లక్షల మంది రైతులకు రైతు భరోసా, 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు వడ్డీలేని రుణాలు, అర్హులైన వారికి సామాజిక భద్రత పింఛన్లు, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున సాయం అందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తుకు ప్రత్యేక చర్యలు.

. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహార పథకం అమలు చేస్తున్నట్లు భట్టి విక్రమార్క చెప్పారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు వెల్లడించారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామని, వైరా నియోజకవర్గానికి కూడా ఈ పాఠశాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాంతానికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను కూడా కేటాయించామన్నారు. అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి, ప్రపంచంతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని పేర్కొన్నారు.

రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు..

రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి సుమారు రూ.90 వేల కోట్లతో పనులు చేపడుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు పైగా పెరిగినా నిరంతర సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత పదేళ్లలో రాష్ట్రంపై సుమారు రూ.8.20 లక్షల కోట్ల అప్పుల భారం పడిందని, ప్రస్తుతం అసలు, వడ్డీల చెల్లింపులకు ప్రతి నెలా సుమారు రూ.6,600 కోట్లు వెచ్చించాల్సి వస్తోందని పేర్కొన్నారు. అయినప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.

నీటిని పొదుపుగా వినియోగించాలి..

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని భట్టి విక్రమార్క హెచ్చరించారు. తాగునీటితోపాటు పశువులు, పక్షుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించాలని ప్రజలకు సూచించారు. భూగర్భ జలాల పరిస్థితిని గమనించి మోటార్లను వినియోగించాలని రైతులను కోరారు. నీటి పొదుపుపై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణుల సూచనలతో ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించాలని పేర్కొన్నారు.

మరో బీటీ రోడ్డు మంజూరుకు హామీ..

వైరా నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటికే పలు రహదారులను మంజూరు చేశామని భట్టి విక్రమార్క తెలిపారు. నాచారం గ్రామం నుంచి జూలూరుపాడు మీదుగా తల్లాడ–భద్రాచలం ప్రధాన రహదారిని కలిపేలా గన్నవరం, నాచారం, భద్రతండా ప్రాంతాలకు ఉపయోగపడే మరో బీటీ రహదారిని మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడం, వారి జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువాళ్ళ దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరావు డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టిఆర్పీ పార్టీ నూతన జిల్లా అధ్యక్షుడిగా కొనదొడ్డి నర్సింహులు నియామకం

- నియామక పత్రాన్ని అందజేసిన టీఆర్పీ రాష్ట్ర చీఫ్ తీన్మార్ మల్లన్న
- పార్టీ నాయకులు, అభిమానులు శుభాకాంక్షల వెల్లువ..

ప్రజా వాయిస్ జహీరాబాద్: తెలంగాణ రాజ్యాధికార పార్టీ TRP సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడుగా జహీరాబాద్ ప్రాంతానికి చెందిన కొనదొడ్డి నరసింహ నియామకం నియమితులయ్యారు.ఆదివారం నాడు పార్టీ అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఈ మేరకు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా, బడుగు బలహీన వర్గాలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా కొనదొడ్డి నరసింహ నియామకం శుభ సూచకమైన విషయం, అలాగే జిల్లాలో పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడంతో పాటు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీల హక్కుల సాధన కోసం కృషి చేయాల్సిన బాధ్యత నూతన జిల్లా అధ్యక్షుడిపై ఉందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడ్డాయి. పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి పాటుపడాలని నాయకులు ఆకాంక్షించారు.నియామక పత్రం అందుకున్న సందర్భంగా కొనదొడ్డి నరసింహకు పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో సంగారెడ్డి జిల్లాలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పండుగ వేళ విషాదం

- ట్రాక్టర్ -ఆటో ఢీ
- యువకుడు దుర్మరణం!
- తాళ్లగడ్డ శివారులో రోడ్డు ప్రమాదం
- యాదగిరిపల్లిలో విషాదఛాయలు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం: వన్ టౌన్ ఎస్ ఐ వెంకటేశ్వర్లు

ప్రజా వాయిస్, మిర్యాలగూడ: నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తాళ్లగడ్డ శివారులో ట్రాక్టర్, ఆటో ఢీకొన్న ఘటనలో యాదగిరిపల్లి గ్రామానికి చెందిన పగిళ్ల ప్రశాంత్ (తండ్రి శ్రీనివాస్) అనే యువకుడు మృతి చెందాడు.వన్‌టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిపల్లి గ్రామానికి చెందిన పగిళ్ల ప్రశాంత్ మిర్యాలగూడ పట్టణానికి వస్తున్న క్రమంలో తాళ్లగడ్డ శివారులో ట్రాక్టర్ ఆటోను ఢీ కొట్టటం జరిగింది.ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రశాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు.సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను పరిశీలించామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించామని,ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.పండుగ వేళ యువకుడు మృతి చెందడంతో యాదగిరిపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రశాంత్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

నందిగామ 6వ వార్డు డ్రైనేజీ సమస్య అభివృద్ధిపై రాజకీయ సెగ

- నిధులు సిద్ధం.. ప్రతిపక్షాల విమర్శలు అవాస్తవం
- 6వ వార్డు సభ్యులు శివగాళ్ల ప్రవీణ్ సర్పంచ్ కొమ్ము కృష్ణ సహకారంతో నిధులు సిద్ధం
- ప్రజల సహకరించాలని కోరుతున్నాను

(ప్రజా వాయిస్ షాద్‌నగర్) నందిగామ గ్రామ పంచాయతీ పరిధిలోని 6వ వార్డులో మురుగునీటి పారుదల డ్రైనేజీ సమస్య స్థానికంగా రాజకీయ చర్చకు దారితీసింది వార్డులోని డ్రైనేజీ సమస్యను ఆసరాగా చేసుకుని ప్రతిపక్ష నాయకులు విమర్శలు గుప్పిస్తుండటంతో 6వ వార్డు సభ్యులు శివగాళ్ల ప్రవీణ్ ఘాటుగానే స్పందించారు సమస్యను రాజకీయం చేయడం కన్నా, పరిష్కారానికి సహకరించడమే ముఖ్యమని పేర్కొన్నారు రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ పూర్తి సహకారంతో గ్రామ పంచాయతీ నుంచి డ్రైనేజీ బోర్డు నూతన లైన్ల నిర్మాణానికి అవసరమైన నిధులను ఇప్పటికే సిద్ధం చేయించామని ఆయన వెల్లడించారు డ్రైనేజీ సమస్య ఆలస్యమవుతోందని పనులు జరగడం లేదని విపక్ష నాయకులు విమర్శలు చేస్తుండటంతో వార్డులో రాజకీయ వాతావరణం వేడెక్కింది వార్డు సభ్యులు శివగాళ్ల ప్రవీణ్ మాట్లాడుతూ పంచాయతీలో నిధుల కొరత లేదు సర్పంచ్ కొమ్ము కృష్ణ సహకారంతో డ్రైనేజీ పనులకు నిధులు కేటాయించాం అని తెలిపారు నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ లైన్ల తవ్వకం మరియు నిర్మాణం చేపట్టేందుకు కొందరు స్థానిక ప్రజల నుండి సరైన సహకారం లభించకపోవడం వల్లే పనుల్లో స్వల్ప జాప్యం జరుగుతోందని స్పష్టం చేశారు విమర్శలు చేసే ప్రతిపక్షాలు కూడా ప్రజలను చైతన్య పరిచి పనులు త్వరగా పూర్తయ్యేలా సహకరించాలని పిలుపునిచ్చారు.

డొక్కు బస్సులతో ఇంకెన్నాళ్లు?

చౌటకూర్లో ముగిసిన సద్దుల బతుకమ్మ ఉత్సవాలు

- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సింగర్ జాను లహరి

ప్రజా వాయిస్ సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా చౌటాకుర్ మండల కేంద్రంలో సర్పంచ్ పార్కుల రామ్ రెడ్డి ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందుకోసం గతంలో ఎప్పుడు లేని విధంగా పండుగను వైభవంగా నిర్వహించాలని ఉద్దేశంతో ప్రముఖ గాయకురాలు జాను లహరి తో పాటు, చౌటకూర్ గ్రామానికి చెందిన రాజ్ కుమార్ ల బృందంతో ఆటపాట అనే కార్యక్రమం నిర్వహించారు. మూడు గంటల పాటు గ్రామ ప్రజలతో కలిసి జానపద గాయాకురాలు జాను లహరి మిత్రబృందం గ్రామస్తులను బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు. ఇందుకోసం సర్పంచ్ తన సొంత డబ్బులతో సుమారు మూడు లక్షల 50 వేలు ఖర్చు చేసి కళాకారులను పిలిపియడంతో పాటు ప్రత్యేకంగా గతంలో ఎప్పుడు లేని విధంగా గ్రామంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించడం పట్ల గ్రామస్తులు సర్పంచ్ చేసిన ఏర్పాట్లను అభినందించారు.

సాయిబాబా నగర్ ను జల్లెడ పడుతున్న మన్నే రాజు

- ఇంటింటి పరిచయాలతో దూసుకెళ్తున్న సీనియర్ నేత
- రానున్న జిహెచ్ఎంసి లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా
- కార్పొరేటర్ అయి మరిన్ని సేవలు అందిస్తా మన్నె రాజు, మాజీ చైర్మన్ ఫిషరీస్

మేడ్చల్ జిల్లా ప్రజా వాయిస్ సూరారం/మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం లో సీనియర్ నేతగా ఉన్న మన్నే రాజు అందరికీ సుపరిచితుడే. ఇప్పటికే రెండుసార్లు కార్పొరేటర్ మిస్సైంది టికెట్ ఇచ్చినట్టే ఇచ్చి తర్వాత చేయి జారిపోయిన నేపథ్యం.. ఎక్కడ ధైర్యం చెడిపోకుండా టీఆర్ఎస్ బీఆర్ఎస్ లో కొనసాగి తర్వాత అక్కడ పడుతున్న ఇబ్బందులను గ్రహించి కాంగ్రెస్లో చేరారు. పేద ప్రజలకు ఎక్కడ ఆపద ఉన్న అక్కడికి వెళ్లే మన్నే రాజు ఫ్రీ మెడికల్ క్యాంపులు పెట్టుకుంటూ దాదాపు 500 మంది మహిళలకు చీరలు పంచుతూ రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలలో సాయిబాబా నగర్ డివిజన్ నుంచి కాంగ్రెస్ జెండా ఎగర వేసి కార్పొరేటర్ గా మీ ముందుకు ఉంటాను అని ధీమా వ్యక్తం చేశారు రాజు. మేడ్చల్ జిల్లాను ఇంకా అభివృద్ధి పథంలో ముందుకు సాగడానికి నా వంతు కృషి చేస్తానని తెలియజేశారు. రాజకీయాలలో డబ్బులు ఉంటాయి కానీ వ్యక్తిత్వాన్ని మాత్రం కోల్పోకుండా కాంగ్రెస్ పార్టీ జెండా పట్టి రేవంత్ రెడ్డికి అండగా కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం కోసం నా వంతు సహాయం చేస్తానని మన్నే రాజు తెలియజేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

- వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని పోలీసుల విజ్ఞప్తి
- శంకరంపేట బస్టాండ్ లో అపస్మారక స్థితిలో లభ్యమైన యువకుడు
- సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి
- మృతుడి వయసు సుమారు 34 ఏళ్లు.. మార్చురీలో మృతదేహం

పెద్దశంకరంపేట (ప్రజా వాయిస్):శంకరంపేట బస్టాండ్లో అపస్మారక స్థితిలో లభ్యమైన ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి వివరాలు తెలిసిన వారు సమాచారం అందించాలని స్థానిక పోలీసులు ఒక పత్రికా ప్రకటనలో కోరారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 12వ తేదీన శంకరంపేట బస్టాండ్ ఆవరణలో సుమారు 34 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని మగ వ్యక్తి స్పృహ తప్పి పడి ఉన్నాడు. ఇది గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్కు సమాచారం అందించారు. ప్రాథమిక చికిత్స నిమిత్తం అతడిని ముందుగా జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అదే రోజు సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్ల పర్యవేక్షణలో చికిత్స పొందుతూ పరిస్థితి మరింత విషమించి ఈ నెల 16వ తేదీన మరణించాడు.

- నలుగురు కలిసి తోస్తేనే స్టార్ట్ ..
- వికారాబాద్ డిపోలో అధ్వాన్న పరిస్థితులు!
- కాలం చెల్లిన బస్సులతో ప్రయాణికుల భద్రతకు ముప్పు?

ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో: ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించాల్సిన ఆర్టీసీ బస్సులు కదలడమే గగనంగా మారితే పరిస్థితి ఎలా ఉంటుంది? వికారాబాద్ ఆర్టీసీ డిపోలో బస్సుల నిర్వహణపై ఇలాంటి ప్రశ్నలే తలెత్తుతున్నాయి. డొక్కు బస్సులు, తరచూ తలెత్తుతున్న సాంకేతిక సమస్యలు ప్రయాణికులను ఆందోళనకు గురిచేస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.వికారాబాద్ డిపో పరిధిలో సుమారు 61 బస్సులు ఉన్నట్లు సమాచారం. వీటిలో కాలం చెల్లిన బస్సులను సైతం కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని బస్సులు కనీసం స్టార్ట్ కావడానికి కూడా నలుగురు కలిసి తోసే పరిస్థితి నెలకొందనే వాదనలు డిపో నిర్వహణ తీరుపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ప్రయాణానికి సిద్ధంగా ఉండాల్సిన బస్సులను రోడ్డెక్కించే ముందే ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతుంటే, ప్రయాణ మధ్యలో సాంకేతిక సమస్యలు తలెత్తితే పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ప్రయాణికుల ప్రాణాలకు భరోసా ఏది?

ఆర్టీసీ బస్సుల్లో ప్రతిరోజూ విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు సహా వందలాది మంది ప్రయాణిస్తుంటారు. వీరందరి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. బస్సుల ఫిట్నెస్, బ్రేకులు, ఇంజిన్ పనితీరు, టైర్లు తదితర అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సి ఉంటుంది. అయితే, బస్సుల పరిస్థితిపై ఫిర్యాదులు వస్తున్నప్పుడు వాటిని కేవలం తాత్కాలిక మరమ్మతులతో సరిచేస్తున్నారా? లేక పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

అధికారులు స్పందించేదెప్పుడు?

ప్రజా రవాణా వ్యవస్థలో బస్సుల కొరత ఉన్నా, ప్రయాణికుల భద్రత విషయంలో రాజీ పడకూడదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాలం చెల్లిన బస్సుల వివరాలను వెల్లడించి, వాటి ఫిట్నెస్ను సమీక్షించాలని, మరమ్మతులు అవసరమైన బస్సులను పూర్తిస్థాయిలో బాగుచేసిన తర్వాతే నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. కొత్త బస్సుల కేటాయింపుతో పాటు అందుబాటులో ఉన్న బస్సులకు సకాలంలో నిర్వహణ చేపట్టాలని సూచిస్తున్నారు.నలుగురు కలిసి తోస్తేనే స్టార్ట్ అయ్యే పరిస్థితి ఉందన్న ఆరోపణలపై అధికారులు ఏం సమాధానం చెబుతారు? డిపోలోని మొత్తం బస్సుల ఫిట్నెస్ వివరాలను ప్రజలకు వెల్లడిస్తారా? ప్రయాణికుల భద్రతకు భరోసా కల్పించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? ఈ ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రజల ప్రయాణ అవసరాలను తీర్చే ఆర్టీసీ సేవలు సురక్షితంగా, నమ్మకంగా ఉండాలంటే బస్సుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిందే.

గ్రామస్థాయి నుంచి ఆదివాసీ కమిటీల బలోపేతం

- కాంగ్రెస్ పార్టీకి ఆదివాసీలు వెన్నుదన్ను
- ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్

ప్రజా వాయిస్, నల్లగొండ: ఆదివాసీలు కాంగ్రెస్ పార్టీకి ఎల్లవేళలా వెన్నుదన్నుగా ఉంటారని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఆదివాసీ చైర్మన్ కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. ఆదివారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో సంఘటన్ సృజన్లో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆదివాసీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.రాష్ట్రంలో ఆదివాసీ సంఘటన్ను బలోపేతం చేయడమే లక్ష్యంగా సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధుల సహకారంతో 33 జిల్లాల్లో జిల్లా కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కమిటీలను నిర్మించి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు సామ రామ్మోహన్ రెడ్డి, సర్వోత్తమ్ రెడ్డిల గెలుపు కోసం ఆదివాసీ నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 23న సీఎం రేవంత్ రెడ్డితో ఆదివాసీ నాయకుల సమావేశం ఉంటుందని, ఈ సందర్భంగా ఆయన దిశానిర్దేశం చేస్తారని తెలిపారు.

75 వేల ఉద్యోగాల భర్తీ.. కాంగ్రెస్ ప్రభుత్వ ఘనత

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందని శంకర్ నాయక్ అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 75 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆశించిన అభివృద్ధి జరగలేదని విమర్శించారు. బీజేపీ మతాల పేరుతో రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. ఈ రెండు పార్టీల వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని వ్యాఖ్యానించారు.

ఊరూర పొదుపు దండోరా..

- నీటిని, విద్యుత్ ఆదాపై ప్రభుత్వం కసరత్తు
- వియోగంపై అవగాహన నిర్వహించనుంది

ప్రజా వాయిస్/దుబ్బాక: తెలంగాణలో ఎల్నినో ప్రభావంతో భవిష్యత్తులో ఎదురయ్యే నీటి ఎద్దడి, విద్యుత్ వినియోగానికి సంబంధించిన సమస్యలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలకు సిద్ధమవుతోంది. నీరు, విద్యుత్ను వృథా చేయకుండా ప్రజలు పొదుపుగా వినియోగించేలా గ్రామ గ్రామాన విస్తృతంగా అవగాహన కల్పించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా గ్రామాల్లో ' పొదుపు దండోరా 'అనే కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ప్రజలకు నిత్య జీవితంలో నీరు, విద్యుత్ను ఎలా ఆదా చేయాలనే విషయాలపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన జాగ్రత్తలు పాటించేలా ప్రచారం చేపట్టనుంది. ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి, నీటి లభ్యతపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందనే అంచనాల నేపథ్యంలో నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. ఈ పరిస్థితుల్లో తాగునీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ప్రజలకు వివరించనుంది. ముఖ్యంగా గ్రామాల్లోని ఓవర్హెడ్ నీటి ట్యాంకుల నుంచి నీరు వృథాగా బయటకు పోకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించనుంది. ట్యాంకులు నిండిన తర్వాత కూడా నీరు బయటకు ప్రవహించడం, పైపుల ద్వారా నీరు వృథా కావడం వంటి పరిస్థితులను నివారించడంపై దృష్టి పెట్టనుంది. నీటి సరఫరా వ్యవస్థలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, లీకేజీలను గుర్తించి సరిచేసేలా సంబంధిత సిబ్బందికి అవగాహన కల్పించనుంది.

విద్యుత్ వినియోగంపై అవగాహన..

విద్యుత్ వినియోగంలోనూ పొదుపు పాటించేలా ప్రజలను చైతన్య పరచాలని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా ఉదయం వేళల్లో ఇళ్లల్లో వినియోగించే విద్యుత్ పరికరాలను అవసరానికి అనుగుణంగా ఉపయోగించాలని ప్రచారం చేయనుంది. అవసరం లేని సమయంలో విద్యుత్ పరికరాలను ఆపివేయడం, ఉపయోగం లేని దీపాలను వెలిగించకుండా ఉండటం వంటి చిన్నచిన్న చర్యల ద్వారా విద్యుత్ను ఆదా చేయవచ్చని ప్రజలకు వివరించనుంది. గ్రామాల్లో వీధి దీపాలను కూడా నిర్ణీత సమయాలకు అనుగుణంగా ఆన్, ఆఫ్ చేసేలా చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. పగటి సమయంలోనూ వీధి దీపాలు వెలుగుతూ ఉండటం వల్ల విద్యుత్ వృథా కాకుండా సంబంధిత సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించేలా చూడనుంది.

మిర్యాలగూడలో అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు

- 13 అడుగుల భారీ బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణ
- జనసంద్రంగా మారిన మైదానం
- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా వేడుకలు
- హాజరైన మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ కుమార్

ప్రజా వాయిస్, మిర్యాలగూడ: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు మిర్యాలగూడ నియోజకవర్గంలో అంగరంగ వైభవంగా, అత్యంత కోలాహలంగా ముగిశాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సాహానికి గుర్తుగా స్థానిక గౌట్ జూనియర్ కళాశాల మైదానంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు, చిన్నారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో మైదానం జనసంద్రంగా మారింది.

ప్రత్యేక ఆకర్షణగా 13 అడుగుల భారీ సద్దుల బతుకమ్మ

స్వరాష్ట్ర సాధన ప్రస్థానానికి గుర్తుగా ప్రత్యేకంగా తయారు చేయించిన 13 అడుగుల భారీ సద్దుల బతుకమ్మ ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన ఈ భారీ బతుకమ్మ ప్రాంగణానికి సరికొత్త శోభను తీసుకొచ్చింది. బతుకమ్మను తిలకించేందుకు మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.వేడుకల ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి స్వయంగా మైదానాన్ని సందర్శించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కుర్చీలు, లైటింగ్, తాగునీరు, భద్రత తదితర ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

అంతరించిపోతున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు జీవం పోస్తూ.. భావితరాలకు బతుకమ్మ వైభవాన్ని చాటిచెప్పేలా ఇలాంటి వేడుకలు నిర్వహించడం అభినందనీయం. పూల పండుగ వెనుక ఉన్న ప్రకృతి ఆరాధన, ఆడపడుచుల ఆత్మగౌరవం, మన సంస్కృతీ సంప్రదాయాల గొప్పతనాన్ని నేటి తరానికి అందించడంలో ఇలాంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయి

ప్రజాప్రతినిధుల కోలాహలం.. చిన్నారులతో కలిసి ఆడిపాడిన ఎమ్మెల్యే దంపతులు

సాయంత్రం వేడుకలు ప్రారంభం కాగానే గౌట్ జూనియర్ కళాశాల మైదానం సందడిగా మారింది. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు, ఆడపడుచులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.ఈ వేడుకల్లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తన సతీమణి బత్తుల మాధవితో కలిసి పాల్గొన్నారు. ఆడపడుచులు, చిన్నారులతో కలిసి బతుకమ్మ చుట్టూ తిరుగుతూ ఎమ్మెల్యే దంపతులు ఉత్సాహంగా ఆడిపాడారు. ప్రజలతో మమేకమై వేడుకల్లో పాల్గొనడంతో అక్కడి వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుధాబాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, బీఎల్ఆర్ బ్రదర్స్, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై సందడి చేశారు. గిరిజన సంప్రదాయ నృత్యాలు, కోలాటాలు, బతుకమ్మ పాటలతో ప్రాంగణమంతా మారుమోగింది. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మలను తీసుకొచ్చి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.

అన్నీ తానై నడిపించిన ఎమ్మెల్యే బీఎల్ఆర్

సద్దుల బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నీ తానై వ్యవహరించారు. ఏర్పాట్లను పర్యవేక్షించడంతో పాటు మైదానంలో ప్రతి ఒక్కరి వద్దకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. చిన్నారులు, మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ సంబరాల్లో పూర్తిగా మమేకమయ్యారు. వేడుకలు సజావుగా సాగేందుకు అవసరమైన ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రకృతిని ఆరాధించే మన తెలంగాణ సంస్కృతి, ఆడపడుచుల ఆత్మగౌరవానికి బతుకమ్మ పండుగ ప్రతీక అని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని గౌరమ్మను ప్రార్థిస్తున్నట్లు వెల్లడించారు.

హర్షం వ్యక్తం చేసిన మహిళా లోకం

గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతిష్టాత్మకంగా, పండుగ వాతావరణంలో ఇంతటి భారీ ఎత్తున బతుకమ్మ వేడుకలు నిర్వహించడంపై నియోజకవర్గ మహిళలు హర్షం వ్యక్తం చేశారు. 13 అడుగుల భారీ బతుకమ్మను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం, మహిళలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, సంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ వేడుకలను నిర్వహించడంపై ఆనందం వ్యక్తం చేశారు.మహిళలందరినీ ఏకం చేసి, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి మహిళలు, ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.మిర్యాలగూడలో సద్దుల బతుకమ్మ సంబరాలు పూల పరిమళాల మధ్య, పాటలు–నృత్యాల సందడితో, ప్రజల ఆనందోత్సాహాల నడుమ వైభవంగా ముగిశాయి.

అన్నదానం ఆధ్యాత్మిక సేవకు ప్రతీక..
ఆకలి తీర్చడమే అసలైన మానవత్వం..

వంగ రవి యాదవ్,కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు

అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలి

పైడాకుల అశోక్,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు

ప్రజా వాయిస్ ములుగు జిల్లా, అక్టోబర్ 18:/

ములుగు జిల్లా కేంద్రంలోని శ్రీ రామాలయం వద్ద నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు డాక్టర్ సముద్రాల శ్రీనివాసాచార్యులు వేద మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్ దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా వంగ రవి యాదవ్ మాట్లాడుతూ.....అన్నదానం అనేది కేవలం ఆహారం అందించే కార్యక్రమం మాత్రమే కాదని, అది ఆధ్యాత్మికతను, సేవాభావాన్ని, మానవత్వాన్ని చాటిచెప్పే పవిత్రమైన కార్యమని అన్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం ద్వారా వారి ఆకలి తీర్చడమే కాకుండా, మనసుకు అపారమైన సంతృప్తి లభిస్తుందని పేర్కొన్నారు. సనాతన ధర్మంలో అన్నదానానికి విశిష్టమైన స్థానం ఉందని, అన్నం పరబ్రహ్మ స్వరూపంగా భావిస్తారని తెలిపారు. దేవి శరన్నవరాత్రులు అమ్మవారి ఆరాధనతో పాటు దయ, కరుణ, సేవ, ధర్మం వంటి సద్గుణాలను ఆచరణలో పెట్టే పవిత్ర సమయమని అన్నారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని, రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు.

దేవాలయాల్లో నిర్వహించే అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు భక్తుల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు సమాజంలో సేవా స్ఫూర్తిని చాటుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు చేతనైనంత సహాయం నిరుపేదలకు అందిస్తూ, ఆధ్యాత్మిక చింతనతో పాటు సామాజిక బాధ్యతను కూడా నెరవేర్చాలని పిలుపునిచ్చారు. "దేవుడికి చేసే పూజ ఎంత పవిత్రమో, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కూడా అంతే పవిత్రమైన సేవ" అని పేర్కొంటూ, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వంగ రవి యాదవ్ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, మున్సిపల్ చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ – బిక్షపతి, సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముళ్ళపెల్లి కుమార్ గౌడ్, గొళ్ళపెల్లి రాజేందర్ గౌడ్, గట్ల సత్యనారాయణ రెడ్డి, ఇమ్మడి రాకేష్ యాదవ్, యారవ పాపిరెడ్డి, ఏలూరి నారాయణరెడ్డి, బాణాల రాజ్ కుమార్, అచ్చునూరి కిషన్, బోగిరి రాకేష్, గుండెబోయిన రమేష్, సానికోము శ్రీనాథ్ రెడ్డి, నగరపు రమేష్, దొంతిరెడ్డి ఇంద్రసేనారెడ్డి, మాలోత్ చందన, నల్లెల ధృవన్, దొంతిరెడ్డి వెంకట్ రెడ్డి, పెరబోయిన విజయ్, మేడికొండ వెంకటరెడ్డి, తంగిరాల గౌతమ్ రెడ్డి, మెడేదుల మమన్, హోట్కర్ ప్రశాంత్, కోగిల రాంబాబు, చిక్కుల శివాజీ, దేవేందర్, కౌన్సిలర్లతో పాటు పలువురు భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పెద్దయెత్తున పాల్గొన్నారు.

టీఆర్పీ జిల్లా అధ్యక్షులుగా కొనదొడ్డి నరసింహ నియామకం

ప్రజా వాయిస్ సంగారెడ్డి :

తెలంగాణ రాజ్యాధికార పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా కొనదొడ్డి నరసింహ నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఈ మేరకు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా, బడుగు బలహీన వర్గాలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా కొనదొడ్డి నరసింహ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది.జిల్లాలో పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడంతో పాటు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీల హక్కుల సాధన కోసం కృషి చేయాల్సిన బాధ్యత నూతన జిల్లా అధ్యక్షుడిపై ఉందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడ్డాయి. పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ అభివృద్ధికి పాటుపడాలని నాయకులు ఆకాంక్షించారు.నియామక పత్రం అందుకున్న సందర్భంగా కొనదొడ్డి నరసింహకు పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో సంగారెడ్డి జిల్లాలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ యువనేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి

పురాతన రహదారి పునరుద్ధరణతో ఆలయ స్థలానికి ఇబ్బంది కలగకుండా చూడాలి: కమిటీ సభ్యుల వినతి

ఎకరం భూమి కేటాయింపునకు కృషి చేస్తానని కార్తీక్ రెడ్డి హామీ

ప్రజావాయిస్// రాజేంద్రనగర్:

శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో సుభిక్షంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి,యువనేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆకాంక్షించారు. బుద్వేల్ టీచర్స్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ ఆలయంలో ప్రధాన అర్చకులు తాళ్ళపాక సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో వైభవోపేతంగా జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఆలయ అభివృద్ధికి సహకరిస్తా

ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి,భవిష్యత్తులో భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై కార్తీక్ రెడ్డి చర్చించారు.ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.ఆలయాల అభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పురాతన రహదారి పనులతో ఆలయ స్థలంపై ఆందోళన బుద్వేల్ నుంచి రాజేంద్రనగర్ వరకు ఉన్న పురాతన రహదారి పునరుద్ధరణకు అధికారులు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ఆలయ స్థలం అంశం తెరపైకి వచ్చింది.రహదారి పనులు ఆలయ ప్రాంగణం మీదుగా జరిగితే దేవాలయానికి సంబంధించిన స్థలం కోల్పోవాల్సి వస్తుందని ఆలయ కమిటీ సభ్యులు కార్తీక్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.ఆలయానికి నష్టం కలగకుండా చూడటంతో పాటు,వర్సిటీ అధికారులతో మాట్లాడి దేవాలయానికి ఒక ఎకరం భూమి కేటాయించేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

ఎకరం భూమి కేటాయింపునకు కృషి చేస్తా

కమిటీ సభ్యుల విజ్ఞప్తిపై స్పందించిన కార్తీక్ రెడ్డి. సంబంధిత వర్సిటీ అధికారులతో చర్చించి ఆలయానికి ఒక ఎకరం భూమి కేటాయించేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఆలయ కమిటీ సభ్యులు,బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేదల పాలిట సంజీవని సిఎం రిలీఫ్ ఫండ్

మాజీ కౌన్సిలర్ కోరబోయిన నాగరాజ్

ప్రజా వాయిస్ సంగారెడ్డి :

నిరుపేద కుటుంబాలకు సంజీవని లాంటిది సీఎం రిలీఫ్ ఫండ్ అని మాజీ కౌన్సిలర్ కోరబోయిన నాగరాజ్ అన్నారు ఆదివారం నాడు బాధితుడు ఉల్వల పరశురామ్ కు 81000 వేల రూపాయల చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ కోరబోయిన నాగరాజ్ (నాని) మాట్లాడుతూ మున్సిపల్ తన 12వ వార్డు పరిధిలో ఎవరికైనా అనారోగ్యం పాలైతే వైద్య ఆరోగ్య మంత్రి దామోదర్ దృష్టికి తీసుకువెళ్లి ఆయన సహకారముతో సమస్యకు తగిన పరిష్కారం చేస్తాను అన్నారు మంత్రి సహకరముతో వార్డును అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తాను అని ధీమా వ్యక్తం చేశారు ఈ సందర్భముగా బాధితుడు ఉల్వల పరశురామ్ నిత్యం అందుబాటులో ఉంటూ వార్డులోని ప్రజలకు అన్నిరకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న కౌన్సిలర్ కోరబోయిన సరస్వతి గారికి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

తెలంగాణ సంస్కృతికి 'బతుకమ్మ' బలమైన పునాది

గంభీర్‌పూర్‌లో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు

ప్రజా వాయిస్ దుబ్బాక

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం గంభీర్‌పూర్ గ్రామంలో బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. గంభీర్‌పూర్ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గ్రామానికి చెందిన మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు మరియు ఆడపడుచుల ఆత్మగౌరవానికి నిదర్శనమని కొనియాడారు. బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, ఇది తెలంగాణ ప్రజల జీవన విధానానికి ఆత్మబంధమని పేర్కొన్నారు. సంస్కృతి సంప్రదాయాలకు ఐక్యత స్పష్టమైన ప్రతిబింబం తొమ్మిది రోజుల పాటు సాగే ఈ వేడుకల్లో తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి రంగురంగుల సహజ సిద్ధమైన పూలతో బతుకమ్మలను పేర్చి ఆడపడుచులు ఆడి పాడే వేడుకల్లో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు మరియు ప్రజల ఐక్యత స్పష్టంగా కనిపిస్తున్నాయని వివరించారు. పూల సువాసనల నడుమ మహిళలందరూ ఒకచోటకు చేరి పాటలు పాడుతూ పండుగ వాతావరణాన్ని నింపారు.

ప్రకృతి ఆరాధన మరియు ఔషధ గుణాల సందేశం

బతుకమ్మలో ఉపయోగించే పూలకు విశేషమైన ఔషధ గుణాలు ఉండటంతో పాటు, ప్రకృతితో మమేకమై జీవించాలనే సందేశాన్ని ఈ పండుగ అందిస్తుందని తెలిపారు. ప్రకృతిని ఆరాధించడం తెలంగాణ సంస్కృతిలో అంతర్భాగమని, బతుకమ్మలను మహిళలే స్వయంగా తయారు చేసి పూజించడం ద్వారా మహిళా ప్రాధాన్యత సగర్వంగా చాటబడుతోందని అన్నారు.

ఆడిపాడిన చిన్నారుల కోలాహలం

ఈ కార్యక్రమంలో చిన్నపిల్లలు బతుకమ్మ పండుగను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. రంగురంగుల దుస్తులు ధరించి చిన్నారులు ఆడిపాడిన పాటలు, చేసిన కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పండుగ సంబరాలతో గంభీర్‌పూర్ గ్రామంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక శోభ సంతరించుకుంది.

మందమర్రి ఏరియా జీఎంకు లింగాపూర్ గ్రామస్తుల వినతి

శాంతిఖని గని ప్రభావిత గ్రామంగా లింగాపూర్ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి

ప్రజా వాయిస్ బెల్లంపల్లి రూరల్

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని లింగాపూర్ గ్రామానికి సంబంధించిన ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు సింగరేణి సంస్థ సహకారం అందించాలని కోరుతూ గ్రామస్తులు మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తొంగల శ్రీనివాస్, దోరిశెట్టి చంద్రశేఖర్, సింగతి సుమన్, దోరిశెట్టి సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ నర్మదా శ్రీనివాస్‌లు జీఎంను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, లింగాపూర్ గ్రామం సింగరేణి శాంతిఖని గని ప్రభావిత ప్రాంతంలో ఉన్నందున గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి సింగరేణి యాజమాన్యం చొరవ తీసుకోవాలని కోరారు. గని ప్రభావిత ప్రాంతంగా ఉన్న గ్రామానికి సంస్థ తరఫున తగిన సహాయ సహకారాలు అందించి, గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులు వివరించిన సమస్యలను మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ సానుకూలంగా విన్నారు. లింగాపూర్ గ్రామ సమస్యల పరిష్కారానికి సింగరేణి సంస్థ తరఫున తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.గ్రామ అభివృద్ధికి సింగరేణి యాజమాన్యం సహకరించి, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి.. పోలీస్‌స్టేషన్ ఎదుట బంధువుల ఆందోళన!

కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండానే మృతదేహాన్ని తరలించారంటూ ఆగ్రహం

రమేష్‌ది ఆత్మహత్య కాదు.. హత్యేనని బంధువుల ఆరోపణ

రాత్రి 10 గంటల నుంచి పుల్కల్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన

ప్రజా వాయిస్, సంగారెడ్డి:

సంగారెడ్డి జిల్లాలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండానే పోస్టుమార్టం నిమిత్తం తరలిస్తున్నారంటూ మృతుడి బంధువులు పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రాత్రి 10 గంటల నుంచి పుల్కల్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు.

దాబాలో పనిచేస్తూ జీవనం.. చెట్టుకు ఉరివేసుకున్న స్థితిలో మృతి

వివరాల్లోకి వెళ్తే.. ధరావత్ రమేష్ అనే వ్యక్తి పుల్కల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగూర్ వద్ద ఉన్న ఓ దాబాలో కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో దాబా సమీపంలోని ఓ చెట్టుకు ఉరివేసుకున్న స్థితిలో రమేష్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే దాబా యజమాని కుమ్మరి లింగంకు సమాచారం అందించగా, ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట బంధువుల ఆందోళన

మృతదేహాన్ని తరలిస్తున్న సమయంలో పుల్కల్ పోలీస్‌స్టేషన్ ఎదుట మృతుడి బంధువులు అడ్డుకున్నారు. రమేష్ మృతికి గల అసలు కారణాలను తమకు తెలియజేయాలని, కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని ఎలా తరలిస్తారని పోలీసులను ప్రశ్నించారు. దీంతో పోలీస్‌స్టేషన్ ఎదుట ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

రమేష్‌ది హత్యేనని బంధువుల ఆరోపణ

రమేష్ మృతిపై తమకు అనేక అనుమానాలు ఉన్నాయని, ఇది ఆత్మహత్య కాదని, హత్యేనని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. పోలీసులు ఉద్దేశపూర్వకంగా కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.కాగా, అనుమానాలు ఉంటే ఫిర్యాదు చేయాలని, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్సై విశ్వజన్ వారికి తెలిపినట్లు సమాచారం. అనంతరం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.రమేష్ మృతికి గల అసలు కారణాలు పోస్టుమార్టం నివేదిక, పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

మనశ్శాంతికి రాజయోగమే మార్గం

ఓం శాంతి రాజయోగిని కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

ప్రజావాయిస్/వికారాబాద్:
ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ప్రశాంతత, ఆత్మశాంతి ఎంతో అవసరమని, వాటిని సాధించేందుకు రాజయోగ ధ్యానం దోహదపడుతుందని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్‌లో నిర్వహించిన ఓం శాంతి రాజయోగిని కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ప్రస్తుత జీవనశైలిలో ఒత్తిడికి దూరంగా ఉంటూ మనసును ప్రశాంతంగా ఉంచుకోవడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా వివరించారు. ధ్యానం ద్వారా ప్రతికూల ఆలోచనలను అధిగమించి, సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవచ్చని పేర్కొన్నారు.మనసుకు ప్రశాంతత.. ఆలోచనలకు స్వచ్ఛత.. జీవితానికి సానుకూలత.. అనే ఆధ్యాత్మిక సందేశాన్ని రాజయోగం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సద్దుల బతుకమ్మ -సర్పంచ్ పిల్లల సందీప్"

ప్రజా వాయిస్ వేములపల్లి:
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సద్దుల బతుకమ్మ అని సర్పంచ్ పిల్లల సందీప్ అన్నారు నల్లగొండ జిల్లా వేములపల్లి మండల పరిధిలోని ఆమనగల్లు గ్రామంలో సర్పంచ్ పిల్లల సందీప్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, రంగురంగుల పూలతో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ పిల్లల సందీప్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, మహిళల ఆత్మగౌరవానికి, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ గ్రామాల్లో ఐకమత్యాన్ని, సోదరభావాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. మహిళలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా ప్రతి ఒక్కరూ పండుగలను సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సద్దుల బతుకమ్మ వేడుకలతో ఆమనగల్లు గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

తెలంగాణ ఉద్యమకారుడు జె. రవీందర్‌కు ఘన నివాళి

మందమర్రి పట్టణంలో నివాళులర్పించిన మాజీ బీఆర్ఎస్ పట్టణ బీసీ సెల్ ఉపాధ్యక్షులు ఉప్పు శ్రీనివాస్

మందమర్రి, ప్రజా వాయిస్:
తెలంగాణ ఉద్యమకారుడు, మందమర్రి బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు స్వర్గీయ జె. రవీందర్ అన్నకు మాజీ బీఆర్ఎస్ పట్టణ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ఉప్పు శ్రీనివాస్ ఘన నివాళులు అర్పించారు. మందమర్రి పట్టణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రవీందర్ సేవలను, తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్రను, ప్రజల కోసం చేసిన కృషిని స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ఉప్పు శ్రీనివాస్ మాట్లాడుతూ, జె. రవీందర్ ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేశారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమకారుడిగా, బీఆర్ఎస్ నాయకుడిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన మరణం పార్టీకి, ఉద్యమ సహచరులకు తీరని లోటని విచారం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రవీందర్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకున్నారు.

9వ వార్డులో నూతన పంపు బాక్స్ ఏర్పాటు

గ్రామ ప్రజల అవసరాలకు ప్రాధాన్యం.

సర్పంచ్ జరుపుల సాయికిరణ్ నాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమం

ప్రజా వాయిస్ బెల్లంపల్లి రూరల్
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా పెర్కపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని 9వ వార్డులో నూతన పంపు బాక్స్‌ను ఏర్పాటు చేశారు. 9వ వార్డుకు చెందిన కుదిరి శ్రీను ఇంటి సమీపంలో ఈ పంపు బాక్స్‌ను ఏర్పాటు చేసే కార్యక్రమం సర్పంచ్ జరుపుల సాయికిరణ్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని వార్డుల్లో ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పించడంతో పాటు, స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు. ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి దశలవారీగా చేపట్టడం ద్వారా గ్రామాభివృద్ధికి మరింత తోడ్పాటు అందించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాకం కొమరయ్య, ఉప సర్పంచ్ సింగతి లక్ష్మి అర్జయ్య, 9వ వార్డు సభ్యురాలు సింగతి రాజేశ్వరి భీమయ్య, 10వ వార్డు సభ్యుడు బోలిశెట్టి సుధాకర్ పాల్గొన్నారు. వీరితో పాటు సింగతి మల్లేష్, కుదిరి శ్రీను, అంకతి ఆనంద్ తదితరులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేస్తూ, ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు..

పట్టణం లో అంగరంగ వైభవంగా వేడుకలు..

ప్రజా వాయిస్/ దుబ్బాక:
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా దుబ్బాక పట్టణంలోని అన్ని వార్డులో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బతుకమ్మ ఆడపడుచులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేనివిధంగా 18వ వార్డులో బతుకమ్మ వేడుకలు ఘనంగా కొనసాగుతుండటంపై స్థానిక మహిళలు, వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బతుకమ్మ ఆడపడుచులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 18 వార్డు కౌన్సిలర్ శ్రీరామ్ సరస్వతి నరేందర్ స్వయంగా ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తుండటంపై పలువురు సంతోషం వ్యక్తం చేశారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను అందరూ కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందని స్థానికులు పేర్కొన్నారు.

దుర్గాష్టమి వేడుకలతో గండమ్మ ఆలయంలో ఆధ్యాత్మిక వైభవం

చండీయాగం,శతచండీ పారాయణంతో మార్మోగిన క్షేత్రం

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

ప్రజావాయిస్//రాజేంద్రనగర్:
గండిపేటలోని చారిత్రాత్మక శ్రీ గండమ్మ అమ్మవారి ఆలయంలో దుర్గాష్టమి వేడుకలు భక్తి పారవశ్యంతో వైభవంగా జరిగాయి.శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని దుర్గాదేవిగా విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కళకళలాడింది.ఆలయ ప్రధాన అర్చకులు మల్లికార్జున్,చంద్రశేఖర్, రాజశేఖర్ శర్మ,బాలకృష్ణ నేతృత్వంలో వేద పండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. లోకకల్యాణం,ప్రజల శ్రేయస్సును ఆకాంక్షిస్తూ ప్రత్యేక హోమాలు, శతచండీ పారాయణం, చండీయాగం నిర్వహించగా,అనంతరం అమ్మవారికి కుంకుమార్చనలు, సహస్రనామార్చనలు సమర్పించారు.వేద మంత్రాల ఘోషతో ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆలయ ఈఓ జలంధర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నవరాత్రుల్లో దుర్గాష్టమికి విశేష ప్రాధాన్యత ఉందని, అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.దుర్గమ్మ నామస్మరణ,యాగాలు, ప్రత్యేక పూజలతో గండిపేట గండమ్మ ఆలయం భక్తిమయంగా మారింది.

జైపూర్ మండలంలో ఘనంగా బాల్క సుమన్ జన్మదిన వేడుకలు

జైపూర్/ ప్రజా వాయిస్ :
జైపూర్ చెన్నూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాల్క సుమన్ జన్మదిన వేడుకలను ఆదివారం జైపూర్ మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సుమన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. బాణాసంచా కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేయగా, పార్టీ శ్రేణుల ఉత్సాహం మధ్య వేడుకలు సందడిగా సాగాయి. సుమన్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు. ఈ జన్మదిన వేడుకలతో జైపూర్ మండలంలో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే తెలంగాణ ఉద్యమంలో బాల్క సుమన్ చురుకుగా పాల్గొన్నారని పేర్కొన్నారు. ఉద్యమ ప్రస్థానం నుంచి ప్రజా జీవితంలోకి అడుగుపెట్టి, చెన్నూరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఆయన నిరుద్యోగ యువత, ప్రజల సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి కోసం చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గుండు తిరుపతి, నాయకులు మల్లా గౌడ్, రాజేందర్‌రెడ్డి, మద్దుల మనోహర్‌రెడ్డి, చిలకాని శ్రావణ్ కుమార్, దూట శేఖర్, జగన్ గౌడ్, శ్రీరాములు, తదితరులతో పాటు మండలానికి చెందిన బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సాంస్కృతిక శోభ.. సైబర్ అవగాహన!

కోరుట్ల పీఎం శ్రీ పాఠశాల విద్యార్థినుల వినూత్న ప్రయోగం

'సైబర్ సురక్ష బతుకమ్మ'తో విస్తృత చైతన్యం

ప్రజా వాయిస్, కోరుట్ల:
తెలంగాణ సాంస్కృతిక ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ వేడుకలను, జాతీయ సైబర్ భద్రత అవగాహన మాసోత్సవాలు-2026ను అద్భుతంగా అనుసంధానిస్తూ జగిత్యాల జిల్లా కోరుట్ల పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఒక వినూత్న ప్రయోగం చేశారు. రాష్ట్ర ప్రజల అత్యంత పవిత్రమైన బతుకమ్మ పండుగను వేదికగా మలుచుకుని, డిజిటల్ భద్రతపై సమాజంలో విస్తృత చైతన్యం తీసుకురావడానికి వారు "సైబర్ సురక్ష బతుకమ్మ"ను ఎంతో కళాత్మకంగా తీర్చిదిద్దారు.సద్దుల బతుకమ్మ పూల సంబురాల వేళ, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనే ముఖ్యమైన సందేశాలను ఈ బతుకమ్మ ద్వారా చాటిచెప్పారు. ముఖ్యంగా 'మల్టీ-ఫ్యాక్టర్ అథెంటికేషన్' విధానాన్ని పాటించడం, సందేహాస్పద లింక్‌లపై క్లిక్ చేసేముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించడం, ఎవరితోనూ వన్ టైమ్ పాస్‌వర్డ్ షేర్ చేయకపోవడం వంటి అత్యంత కీలకమైన సైబర్ భద్రతా నియమాలను ప్రజలకు వివరించారు. అలాగే, ఏదైనా సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని ఈ వేదిక ద్వారా అవగాహన కల్పించారు. పాఠశాల సైబర్ అంబాసిడర్ చందా నాగరాజు మార్గదర్శకత్వంలో విద్యార్థినులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తెలంగాణ సాంప్రదాయాన్ని, ఆధునిక సామాజిక బాధ్యతను జోడించి ఈ సృజనాత్మక కార్యక్రమం చేపట్టిన విద్యార్థినులు అల్లె రక్ష, తేజస్వినిలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. గంగాధర్ ఘనంగా అభినందిచారు.

ప్రజా వాయిస్

భక్తి మనకు ఆధ్యాత్మిక బలం.. ధర్మం మనకు దిశానిర్దేశం..

సేవ సమాజానికి ఐక్యతా సందేశం
పలు దుర్గామాత ఆలయాలను సందర్శించిన అమీన్పూర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు ఈర్ల రాజు

పటాన్ చెరువు ప్రజావాయిస్

పటాన్‌చెరు నియోజకవర్గం, అమీన్పూర్ మండల పరిధిలోని అమీన్పూర్ డివిజన్, బీరంగూడ డివిజన్లలో నవరాత్రి ఉత్సవాలు, దుర్గామాత పూజలు, యజ్ఞహోమ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో చేసి దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు ఈ సందర్భంగా బీజేపీ బీరంగూడ డివిజన్ అధ్యక్షులు ఈర్ల రాజు వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన దుర్గామాత ఉత్సవాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. గండిగూడ గ్రామంలో సత్యనారాయణ ముదిరాజ్ మరియు దుర్గామాత కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఈర్ల రాజు ముదిరాజ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం అనేది మానవత్వానికి ప్రతీక అని, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం గొప్ప సేవ అని ఆయన పేర్కొన్నారు. గండిగూడ కాలనీలో దుర్గామాత పూజలు, యజ్ఞహోమ కార్యక్రమంలో పాల్గొన్నారుగండిగూడ కాలనీలో శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పొట్టి రాజు ముదిరాజ్, నరేష్ ముదిరాజ్ మరియు వారి మిత్రులు నిర్వహించిన దుర్గామాత పూజా కార్యక్రమంలో ఈర్ల రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన యజ్ఞహోమ కార్యక్రమంలోనూ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యజ్ఞహోమాలు మన సనాతన ధర్మంలో పవిత్రమైన ఆధ్యాత్మిక ఆచారాలని, ఇలాంటి కార్యక్రమాలు భక్తిభావాన్ని, ధార్మిక చింతనను పెంపొందిస్తాయని ఆయన అన్నారు.

సేవే లక్ష్యం..మానవత్వమే మార్గం!

|| ఆపదలో ఉన్న అభాగ్యులకు అండగా అమీర్అలి ఫౌండేషన్....

ప్రజా వాయిస్ /అనుమల:

సొంత సంపాదనలో కొంత భాగాన్ని పేదల సేవకు కేటాయిస్తూ.. అనేక సేవా కార్యక్రమాలతో ముందుకుసేవ చేయడానికి ఆస్తులు, అంతస్తులు అవసరం లేదు.. సేవ చేయాలనే మంచి మనసు, మానవత్వంతో స్పందించే హృదయం ఉంటే చాలు అని నిరూపిస్తున్నారు అమీర్అలి ఫౌండేషన్ వ్యవస్థాపకులు, హౌస్ పెయింటర్ అమీర్అలి. తన వృత్తి ద్వారా సంపాదించిన ఆదాయంలో కొంత భాగాన్ని అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు సహాయం చేసేందుకు కేటాయిస్తూ, తనలాంటి సేవా దృక్పథం కలిగిన మిత్రులు, శ్రేయోభిలాషుల సహకారంతో అమీర్అలి ఫౌండేషన్‌ను స్థాపించి పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ

అనారోగ్యంతో బాధపడుతూ కుటుంబ పోషణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిస్సహాయ కుటుంబాలను గుర్తించి, వారికి నెల రోజులకు సరిపడా బియ్యం, కిరాణా సరుకులు, కూరగాయలు అందిస్తూ ఆ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. ఆపదలో ఉన్నవారికి ఆర్థికంగా, సామాజికంగా భరోసా కల్పించడమే లక్ష్యంగా ఫౌండేషన్ పనిచేస్తోంది.

చలికాలంలో వృద్ధులకు అండగా..

చలికాలంలో రోడ్ల పక్కన, షట్టర్ల ముందు, బస్టాండ్ పరిసరాల్లో ఆశ్రయం లేక నిద్రించే వృద్ధుల కష్టాలను గుర్తించి వారికి భోజనం, దుప్పట్లు అందిస్తున్నారు. చలికి వణుకుతూ, కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న అభాగ్యులకు ఈ సేవా కార్యక్రమాలు ఎంతో

ఊరటనిస్తున్నాయి.

ఎండాకాలంలో చలివేంద్రం.. మజ్జిగ పంపిణీ

వేసవిలో ఎండ తీవ్రతతో ప్రయాణికులు, బాటసారులు ఎదుర్కొనే దాహార్తిని తీర్చేందుకు ఫౌండేషన్ సభ్యుల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేసి, మజ్జిగ పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలనే సందేశాన్ని ఈ కార్యక్రమాల ద్వారా అందిస్తున్నారు.

పేదింటి ఆడపిల్లల వివాహాలకు చిరు సాయం

ఆర్థిక ఇబ్బందుల కారణంగా నిరుపేద కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తిస్తూ, పేదింటి ఆడపిల్లల వివాహాలకు తమ వంతుగా చిరు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయం. కష్టకాలంలో ఆ కుటుంబాలకు అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు నోట్‌బుక్స్, పరీక్ష ప్యాడ్స్, స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తూ విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నారు. పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఆశయంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

రక్తదాత సుఖీభవ.. ప్రాణదానమే మహాదానం!

అమీర్అలి ఫౌండేషన్‌కు అనుబంధంగా పనిచేస్తున్న రక్తదాత సుఖీభవ గ్రూప్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి సభ్యులు స్వచ్ఛందంగా రక్తదానం చేస్తూ ప్రాణాలు కాపాడేందుకు ముందుకు వస్తున్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు సహాయపడేందుకు మెగా రక్తదాన శిబిరాలను సైతం నిర్వహిస్తున్నారు. రక్తం అందక ఏ ఒక్కరి ప్రాణం ప్రమాదంలో పడకూడదనే లక్ష్యంతో రక్తదాతలను ప్రోత్సహిస్తూ, రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఫౌండేషన్ కృషి చేస్తోంది.

ప్రతి మనిషికి మరో మనిషి సహాయం అవసరమే: అమీర్అలి

ఈ సందర్భంగా అమీర్అలి ఫౌండేషన్ వ్యవస్థాపకులు, హౌస్ పెయింటర్ అమీర్అలి మాట్లాడుతూ.."ప్రతి మనిషి తన జీవితంలో ఏదో ఒక సందర్భంలో మరో మనిషి సహాయం కోసం ఎదురుచూడటం సహజం. అలాంటి సమయంలో ఆపన్నహస్తం అందించడం మనిషిగా మన బాధ్యత. మన అమీర్అలి ఫౌండేషన్ సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి, అవసరమైన వారికి రక్తదానం చేయడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. సేవ చేయడానికి ధనవంతులై ఉండాల్సిన అవసరం లేదు. మనకు ఉన్నదాంట్లో కొంత భాగాన్ని అవసరంలో ఉన్నవారికి అందించాలనే మంచి మనసు ఉంటే చాలు. ఒకరి కష్టాన్ని తీర్చడం ద్వారా కలిగే సంతృప్తి వెలకట్టలేనిది. సమాజంలో నిస్సహాయులకు అండగా నిలుస్తూ, మరింత మంది సేవా కార్యక్రమాల వైపు అడుగులు వేయాలన్నదే మా ఫౌండేషన్ ప్రధాన లక్ష్యం" అని అమీర్అలి తెలిపారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

ప్రజా వాయిస్/అడ్డగూడూరు:

మండలకేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సంధ్బంగా మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమైన బతుకమ్మ వేడుకల సంబరాలు అంబరాన్ని అంటాయి. ఆయా గ్రామాల్లోని బతుకమ్మ వేడుకల్లో ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

ప్రజా వాయిస్ నిజాంపేట్.

ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మరణించిన ఘటన సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండలంలో చోటుచేసుకుంది SI రావుల శ్రీశైలం తెలిపిన వివరాలు..కొత్తపల్లి వాసి సంపతి సాయికుమార్ (23) నిజాంపేట్ గ్రామ శివారులోని చెట్టు వద్ద నల్ల కుక్క ఉరేసుకుని చనిపోయాడు ఘటన స్థలానికి పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేశారు . ఇది ఆత్మహత్యనా? హత్యనా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

ఆరేపల్లి గ్రామానికి చెందిన యువతి ప్రతిభ....

ప్రజా వాయిస్, పాపన్నపేట

పాపన్నపేట మండల పరిధిలోని ఆరేపల్లి గ్రామానికి చెందిన దొడ్లే మనీషాపాటిల్ రాష్ట్రస్థాయి బతుకమ్మ పాటల పోటీల్లో ప్రతిభ చాటారు. తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఆమె దర్శకత్వం వహించి, నటించిన బుజ్జి బతుకమ్మ పాటకు మూడో బహుమతి లభించింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచు రజిత రాజశేఖర్ తో పాటు గ్రామస్తులు మనిషా పాటిల్ ను అభినందించారు.....

పాల్వాయిలో అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు

పూల పండుగలో ఆడపడుచుల ఆటపాటలు
గ్రామమంతా పండుగ శోభ
పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు
తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా పాల్వాయి

ప్రజా వాయిస్ : గుర్రంపోడు మండలం

నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని గ్రామంలోని ఆడపడుచులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు పూల పండుగలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు ఆలపిస్తూ, చప్పట్లు కొడుతూ ఆటపాటలతో సందడి చేశారు. ఆడపడుచుల కోలాహలం, బతుకమ్మ పాటలతో పాల్వాయి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐకమత్యానికి, ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు గ్రామీణ సంస్కృతి సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పాయి. తరతరాలుగా వస్తున్న ఆచారాలను కాపాడుకుంటూ మహిళలు ఆనందోత్సాహాల మధ్య పండుగను ఘనంగా నిర్వహించారు. సద్దుల బతుకమ్మ వేడుకలతో పాల్వాయి గ్రామం పూల సౌందర్యంతో, ఆడపడుచుల సందడితో కళకళలాడింది.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాసానికి విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న దంపతులు

నూతన దంపతులకు ఆత్మీయ స్వాగతం..
రష్మికకు దసరా కానుకగా ప్రత్యేక బతుకమ్మ చీర అందజేత

ప్రజా వాయిస్ హైదరాబాద్ డెస్క్.

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నివాసానికి సినీ నటుడు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న దంపతులు విచ్చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఆయన సతీమణి నూతన దంపతులకు ఆత్మీయంగా స్వాగతం పలికారు. వివాహం అనంతరం తొలి దసరా పండుగను తెలంగాణలో జరుపుకుంటున్న రష్మిక మందన్నకు ప్రత్యేకంగా రూపొందించిన బతుకమ్మ చీరను దసరా కానుకగా భట్టి విక్రమార్క దంపతులు అందజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ చీరను కానుకగా అందించడం ఈ సందర్భంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణలో బతుకమ్మ పండుగకు విశిష్టమైన స్థానం ఉంది. ఆడపడుచులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మను పేర్చి, పాటలు పాడుతూ జరుపుకునే ఈ పండుగ రాష్ట్ర సంస్కృతి, మహిళల ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో రష్మికకు బతుకమ్మ చీరను దసరా కానుకగా అందించడం తెలంగాణ సంప్రదాయాల పట్ల ఆప్యాయతను చాటింది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న దంపతుల రాకతో భట్టి విక్రమార్క నివాసంలో సందడి నెలకొంది. దసరా పండుగ వేళ నూతన దంపతులకు ప్రత్యేక కానుక అందించడం ఈ భేటీలో విశేషంగా నిలిచింది.

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు
అభివృద్ధిలో వెనకాడేది లేదు:ఎమ్మెల్యే వంశీకృష్ణ

ప్రజా వాయిస్ అచ్చంపేట అక్టోబర్ 18

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను అచ్చంపేట శాసనసభ్యులు ఎమ్మెల్యే వంశీకృష్ణ పంపిణీ చేశారు.పేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గోపాల్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, అధికారులు ప్రజాప్రతినిధులు, మహిళలు స్థానిక నాయకులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు!

అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి

దేవీ శరన్నవరాత్రుల వేడుకల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న మాద్రి పృథ్వీరాజ్

పటాన్ చెరువు ప్రజావాయిస్
అమ్మవారి కృప కటాక్షాలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎండిఆర్ ఫౌండేషన్ చైర్మన్ మాద్రి పృథ్వీరాజ్ అన్నారు పటాన్చెరు నియోజకవర్గంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నాడు పటాన్చెరు పట్టణంలోని బండ్లగూడ, శ్రీరామ్ నగర్, జె.పి. కాలనీ, నర్ర బస్తీ, పోచారం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలను సందర్శించిన మాద్రి పృథ్వీరాజ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. భక్తి, ఆధ్యాత్మికతతో ఉట్టిపడుతున్న నవరాత్రి వేడుకల్లో భక్తులతో కలిసి పాల్గొని పండుగ శోభను మరింత పెంచారు తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలంతా కలిసి మెలిసి కులమతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలని దుర్గామాత ఆశీస్సులతో పంటలు బాగా పండి రైతులు కలలో ఆనందం వెలగాలని అన్నారు ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల ప్రజలు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు .

ధైర్యలక్ష్మి అలంకరణలో అమ్మవారు

ముచ్చింతల్‌లో భక్తి వైభవం

శాస్త్రోక్తంగా నారసింహ ఇష్టి.. మరోవైపు సంప్రదాయబద్ధంగా బతుకమ్మ సంబరాలు

ప్రజావాయిస్//రాజేంద్రనగర్:
శరన్నవరాత్రి వేడుకలతో శంషాబాద్ ముచ్చింతల్‌లోని స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఎనిమిదో రోజు ఆదివారం అమ్మవారు ధైర్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా,అమ్మవారి దివ్యరూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ఉత్సవాల్లో భాగంగా నారసింహ ఇష్టి కార్యక్రమాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రుత్వికుల మంత్రోచ్చారణలు,వేద మంత్రాల నడుమ సాగిన పూజలు భక్తులను ఆధ్యాత్మిక అనుభూతికి లోను చేశాయి.

పూల సోయగం.... బతుకమ్మ సందడి
మరోవైపు స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి,వాటి చుట్టూ చేరి పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. పూల పరిమళం,బతుకమ్మ పాటల సందడి,భక్తుల కోలాహలంతో ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఒకవైపు అమ్మవారి ఆరాధన.. మరోవైపు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు. ఇలా భక్తి, ఆధ్యాత్మికత,సాంస్కృతిక వైభవం కలగలిసి స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ ప్రాంగణం కన్నులపండువగా మారింది.

అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పది..!

- ఎస్ఐ సురేష్ రెడ్డి

ప్రజా వాయిస్ వేములపల్లి,
అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పదని ఎస్ఐ సురేష్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రావులపెంట గ్రామంలోని శ్రీ కనకదుర్గ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రశాంతమైన వాతావరణంలో దేవి నవరాత్రి నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం శ్రీ కనకదుర్గ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్ఐని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దీక్షా స్వాములు,మహిళలు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు లేక ఎండిపోతున్న పంటలు

రైతుల కన్నీళ్లు పట్టించుకోని ప్రభుత్వం

రెండో రోజు కొనసాగిన బీజేపీ 'కెనాల్స్ బాట కార్యక్రమం

ఎండిన పంటలను పరిశీలించిన బీజేపీ కొల్లాపూర్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్ రావు

ప్రజా వాయిస్.. వీపనగండ్ల
కొల్లాపూర్ నియోజకవర్గంలో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని బీజేపీ కొల్లాపూర్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఎల్లేని సుధాకర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు చేపట్టిన 'కెనాల్స్ బాట' కార్యక్రమం రెండో రోజు వీపనగండ్ల మండలంలో ప్రారంభమై చిన్నంబావి, పెంట్లవెల్లి మండలాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా వీపనగండ్ల మండలంలోని సంగినేనిపల్లి, కల్వరాల, వీపనగండ్ల గ్రామాలతో పాటు చిన్నంబావి మండలంలోని మియాపూర్, వెలగొండ, చిన్నంబావి గ్రామాలు, పెంట్లవెల్లి మండలంలోని గోప్లాపూర్, సింగోరం గ్రామాల్లో ఆయన పర్యటించి రైతులతో మాట్లాడారు. బీమా, జూరాల కాలువల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్న పరిస్థితులను పరిశీలించారు. పంటలు కళ్ల ముందే ఎండిపోతుండటంతో పెట్టుబడులు నష్టపోతున్నామని, తమ పరిస్థితి దయనీయంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంగినేనిపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు తన బాధను వివరిస్తూ కన్నీళ్లు పెట్టుకోవడం తనను తీవ్రంగా కలచివేసిందని ఎల్లేని సుధాకర్ రావు పేర్కొన్నారు.

మంత్రి జూపల్లి, మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డిపై విమర్శలు
రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం, స్థానిక మంత్రి స్పందించకపోవడం దారుణమని ఎల్లేని సుధాకర్ రావు విమర్శించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు తన సొంత నియోజకవర్గంలోనే కాలువలకు సాగునీరు అందించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. గతంలో అధికారంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి సైతం కాలువల ఆధునికీకరణ, సాగునీటి విడుదలపై తగిన శ్రద్ధ చూపలేదని విమర్శించారు. ఇరువురి నిర్లక్ష్యం కారణంగానే కొల్లాపూర్ నియోజకవర్గ రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.

బీజేపీ ప్రధాన డిమాండ్లు
ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు బీమా, జూరాల కాలువలకు వెంటనే పూర్తిస్థాయిలో సాగునీటిని విడుదల చేయాలి,సాగునీరు అందక పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలి. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేంతవరకు రైతుల పక్షాన తమ పోరాటాన్ని కొనసాగిస్తామని ఎల్లేని సుధాకర్ రావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

వల్మిడిలో అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు!

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా సద్దుల బతుకమ్మ

ఆటపాటలతో ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ వేడుకలు

ఐక్యతను చాటిన వల్మిడి గ్రామ మహిళలు

పూల పండుగతో గ్రామంలో వెల్లివిరిసిన పండుగ వాతావరణం

సంప్రదాయ పాటలు, నృత్యాలతో అంబరాన్నంటిన సంబరాలు

ప్రకృతిని పూజిస్తూ ఘనంగా బతుకమ్మ వేడుకలు

పూల పండుగలో ఆనందోత్సాహాలతో పాల్గొన్న గ్రామ ఆడపడుచులు.. డీజే పాటలు, బతుకమ్మ ఆటలతో మార్మోగిన వల్మిడి

ప్రజా వాయిస్ । పాలకుర్తి । అక్టోబర్ 18
జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మిడి గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామానికి చెందిన ఆడపడుచులు, మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా బతుకమ్మ పండుగను నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను మధ్యలో ఉంచి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ మహిళలు చేసిన సందడి గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపింది. డీజే సంగీతం, బతుకమ్మ పాటల నడుమ మహిళలు, యువతులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ వేడుకల్లో పాల్గొన్నారు. పూల బతుకమ్మల చుట్టూ చేరి ఆడిపాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పారు. గ్రామంలోని ఆడపడుచులంతా ఒకచోట చేరి సంతోషంగా వేడుకలు జరుపుకోవడంతో గ్రామమంతా సందడిగా మారింది.

బతుకమ్మ పండుగ విశిష్టత ఇదే.
బతుకమ్మ తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకమైన పూల పండుగ. ప్రకృతిని, పూలను, నీటిని, మహిళల ఆత్మీయతను గౌరవించే ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుంది. ఆశ్వయుజ మాసంలో తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ వేడుకలు నిర్వహించి, చివరి రోజున సద్దుల బతుకమ్మను జరుపుకుంటారు. గునుగు, తంగేడు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి గౌరమ్మను పూజిస్తారు. మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ బతుకమ్మ చుట్టూ ఆడిపాడి, చివరిరోజున బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేస్తారు. ప్రకృతితో మమేకమై జీవించాలనే సందేశాన్ని ఈ పండుగ అందిస్తుంది.

తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా బతుకమ్మ
బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, కుటుంబాల మధ్య ఆత్మీయతకు, గ్రామీణ జీవన సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలుస్తుంది. తరతరాలుగా వస్తున్న ఈ పూల పండుగను వల్మిడి గ్రామ మహిళలు ఆనందోత్సాహాలతో నిర్వహించడం విశేషం. బతుకమ్మ పాటలు, పూల పరిమళాలు, మహిళల కోలాహలంతో వల్మిడి గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా సాగాయి.

గంగానీళ్ల జాతరకు బయలుదేరిన బోథ్ రాజేశ్వరు దేవుడు

200 మంది భక్తులతో సాంగ్వికి పయనం..

గంగాజలంతో ముత్యాల పోచమ్మ అమ్మవారికి అభిషేకం

అనంతరం ప్రారంభం కానున్న సలిబోనాల

ప్రజా వాయిస్ బోథ్
అదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలో ముత్యాల పోచమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకొని గంగానీళ్ల యాత్రకు బోథ్ రాజేశ్వరు దేవుడు బయలుదేరారు. ఈ పవిత్ర యాత్రలో భాగంగా సుమారు 200 మంది భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని సాంగ్వికి పయనమయ్యారు. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక సంప్రదాయంలో భాగంగా నిర్వహించే ఈ యాత్రకు బోథ్ ప్రాంతంలో ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. బోథ్‌లో కొలువైన ముత్యాల పోచమ్మ అమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారికి సంబంధించిన ఆభరణాలను సాంగ్వికి తీసుకెళ్లి, అక్కడ గంగానీళ్లతో శుద్ధి చేసి తిరిగి తీసుకురావడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ సంప్రదాయాన్ని అనుసరిస్తూ రాజేశ్వరు దేవుడు అమ్మవారి ఆభరణాలను తీసుకొని భక్తులతో కలిసి గంగానీళ్ల యాత్రకు బయలుదేరారు. ఈ యాత్రలో పాల్గొన్న భక్తులు అమ్మవారి ఆశీస్సులు తమపై ఉండాలని, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటూ ముందుకు సాగారు.

గంగాజలంతో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం
సాంగ్వి నుంచి గంగానీళ్లను తీసుకువచ్చిన అనంతరం ఆదివారం బోథ్‌లోని ముత్యాల పోచమ్మ అమ్మవారికి పవిత్ర గంగాజలంతో ప్రత్యేక అభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం అమ్మవారి ఆభరణాలను గంగానీళ్లతో శుద్ధి చేసి, వాటితో అమ్మవారిని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పూజా కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించడంతో పాటు జాతరలో ముఖ్యమైన ఘట్టంగా నిలవనున్నాయి. గంగానీళ్లతో అమ్మవారికి అభిషేకం నిర్వహించి, ఆభరణాలతో అలంకరించి పూజలు పూర్తిచేసిన అనంతరం అమ్మవారికి సలిబోనాలు సమర్పించే కార్యక్రమం ప్రారంభమవుతుందని నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమాల ద్వారా అమ్మవారి కృపాకటాక్షాలు గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు కోరుకుంటారు.

పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు
ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, రైతుల పంటలు సమృద్ధిగా పండాలని, పాడిపంటలతో గ్రామం కళకళలాడాలని, పిల్లాపాపలతో ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ముత్యాల పోచమ్మ అమ్మవారిని ప్రార్థిస్తూ ఈ జాతర, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. ప్రజలు ఎదుర్కొనే కష్టాలు తొలగిపోయి, అందరి జీవితాల్లో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని అమ్మవారిని వేడుకుంటారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి జాతరలు భక్తి విశ్వాసాలకు ప్రతీకలుగా నిలవడమే కాకుండా, ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడంలోనూ కీలక పాత్ర పోషిస్తాయి. తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాలను కొనసాగిస్తూ భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనడం విశేషం. బోథ్ రాజేశ్వరు దేవుడు సుమారు 200 మంది భక్తులతో గంగానీళ్ల యాత్రకు బయలుదేరడంతో బోథ్ ప్రాంతంలో జాతర సందడి మొదలైంది. గంగానీళ్ల రాక, అమ్మవారి అభిషేకం, ఆభరణాల అలంకరణ, సలిబోనాల సమర్పణ వంటి కార్యక్రమాల కోసం భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సంతోషంగా జీవించాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

ఫారం-6లో మార్పులు చేయాలి

ముంబై, అక్టోబరు 18: ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా ఓటరు జాబితా నుంచి తొలగింపునకు గురైన వారు.. తిరిగి ఓటరుగా దరఖాస్తు చేసుకునేందుకు ఫారమ్ 6లో మార్పులు చేయాలని మహారాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. సర్‌లో స్థానం కోల్పోయి తిరిగి ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ప్రస్తుతమున్న ఫారమ్ 6లో.. గత సర్ జాబితాలో తమకు సంబంధించి లేదా తమ తల్లిదండ్రులకు సంబంధించి వివరాలను ఇవ్వడం తప్పనిసరి. లేదంటే తాము మొదటిసారి ఓటు కోసం దరఖాస్తు చేసుకుంటున్నామని ధ్రువీకరణ ఇవ్వాలి. ఇలా చేయడం తప్పుడు ధ్రువీకరణ కిందకే వస్తుంది. ఇలా చేస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950లోని సెక్షన్ 31 కింద ఏడాది వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదంటే రెండూ ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ ఇబ్బందులు తొలగించేందుకు వీలుగా మహారాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఫారమ్-6లో మార్పులు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి గత వారం ప్రతిపాదించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. 'న్యూ ఓటర్' కాలమ్ తొలగించాలని.. గతంలో ఏదేనీ శాసనసభ నియోజకవర్గం పరిధిలో ఓటరుగా నమోదు చేసుకుని, తొలగింపునకు గురైన వారు తిరిగి దరఖాస్తు చేసుకునేందుకు ప్రత్యామ్నాయ ధ్రువీకరణకు అవకాశం కల్పించాలని కోరారు. తొలగింపునకు ముందున్న ఎలక్షన్ ఫొటో ఐడెంటిటీ కార్డు (ఎపిక్) నంబర్‌ను నమోదు చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఫారమ్-6లో మార్పు చేస్తే అప్పుడు అర్హత కలిగిన వారు సులభంగా తిరిగి నమోదు చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది.



ఇబ్రహీంపూర్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

ప్రజా వాయిస్ /తుర్కపల్లి

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలో బతుకమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మన్నెపు రజిత తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామ మహిళలు, యువతులు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ఒకచోట చేర్చి, సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పాటలు పాడుతూ మహిళలు సంబరాలు చేసుకున్నారు. పూల పండుగగా పేరుగాంచిన బతుకమ్మ వేడుకల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొనడంతో గ్రామంలో సందడి నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా జరుపుకోవడం ఆనందంగా ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మన్నెపు రజిత తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు కలిసి పండుగ వేడుకల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామంలో ఐక్యత, సోదరభావం, సంప్రదాయాల పరిరక్షణకు ఇలాంటి పండుగలు దోహదపడతాయని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సామల శ్రీనివాస్, పాశం గోవర్ధన్, నగరం కరుణాకర్, మహేందర్, నీలం కొమరయ్య, గుంటిపల్లి శివాజీ, కారోబార్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలని మంత్రి వివేక్ వెంకటస్వామి నీ కలిసిన బాదితులు

బాధితుల సంఘం తరఫున వినతిపత్రం ఇవ్వడం జరిగినది

ప్రజా వాయిస్.మంచిర్యాల

మంచిర్యాల జిల్లాలో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి నివాసంలో అగ్రిగోల్డ్ బాధితుల విషయం గురించి చర్చించడం జరిగింది. ఈ మధ్యకాలంలో అగ్రిగోల్డ్ సంస్థకు సంబంధించి సిఐడి వారి చేత ఆంధ్రప్రదేశ్లో కొన్ని సెంటర్లలో మరి అదేవిధంగా తెలంగాణలో మూడు సెంటర్లలో బాండ్ల వెరిఫికేషన్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగినది . ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుమారు అగ్రిగోల్డ్ బాధితులు 80000 మంది పైబడి ఉన్నందున అగ్రిగోల్డ్ బాధితులు ఉన్నందున మంచిర్యాల జిల్లా కేంద్రంలో అగ్రిగోల్డ్ బాండ్ల వెరిఫికేషన్ సిఐడి వారిచే ఏర్పాటు చేయాలని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి నీ కలిసి అగ్రిగోల్డ్ బాధితుల అసోసియేషన్ నుండి విజ్ఞప్తి చేయడం జరిగినది. వారు వెంటనే సానుకూలంగా స్పందించి సిఐడి వారితో మాట్లాడి మంచిర్యాల జిల్లాలో వెరిఫికేషన్ సెంటర్ ను ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా అగ్రిగోల్డ్ అసోసియేషన్ తరపున వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగినది ఈ కార్యక్రమంలో అగ్రిగోల్డ్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు యం శ్రీనివాసరావు, అగ్రి అగ్రిగోల్డ్ అసోసియేషన్ సభ్యులు దామర శెట్టి రమేష్, రామడుగు లక్ష్మణ్, ఇరుకుల్ల సుధాకర్, ప్రవీణ్ కుమార్ , సమ్మయ్య , రాజు ,పున్య, మహేష్ , సురేష్ కుమార్ , అహ్మద్ , ముజాహిదీన్ , తదితరులు పాల్గొన్నారు

మందమర్రిలో కామాఖ్య అమ్మవారిని దర్శించుకున్న రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజ ఆశీస్సులు పొందిన పోలీస్ కమిషనర

ప్రజా వాయిస్ మందమర్రి

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని ప్రసిద్ధ కామాఖ్య అమ్మవారి ఆలయాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకున్న సీపీ అంబర్ కిషోర్ ఝాకు ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం మధ్య అమ్మవారిని దర్శించుకునే అవకాశం లభించింది. కామాఖ్య అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి కృపాకటాక్షాలు కలకాలం ఉండాలని ప్రార్థించారు. మందమర్రి పట్టణంలోని కామాఖ్య అమ్మవారి ఆలయం భక్తుల విశ్వాసానికి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలుస్తోంది. ఈ ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటూ తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఈ నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. అమ్మవారి దర్శనంతో ఆధ్యాత్మిక ప్రశాంతత పొందిన సీపీ, కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో కొంతసేపు గడిపారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ బతుకమ్మ సంబరాలు

వాడ వాడల మహిళల పూల పండుగ కోలాటాలు

జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ నిమజ్జనం

ప్రజా వాయిస్ కామారెడ్డి /

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబరాలు మహిళలు కన్నుల పండుగ జరుపుకున్నారు. కామారెడ్డి ఎల్లారెడ్డి బాన్సువాడ డివిజన్లలో గ్రామ గ్రామాన వాడ వాడను సద్దుల బతుకమ్మ ఉత్సాహంగా జరుపుకున్నారు. 2000 సంవత్సరాల క్రితం శాతవాహనుల కాలంలో తెలంగాణలో బతుకమ్మ పండుగ ప్రారంభమైంది కవులు పెద్దలు చెబుతున్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు పూల పండుగ బతుకమ్మ నిదర్శనమని చెబుతున్నారు. దేశంలో పూలను కొలిచే పూలతో జరుపుకునే పండుగ తెలంగాణలోనే జరుగుతుందని పేర్కొంటున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో బాన్సువాడ డివిజన్ కేంద్రంలో ఎల్లారెడ్డిలో బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. బతుకమ్మ పండగకు మహిళల బతుకమ్మ ల నిమజ్జనానికి తెలంగాణ ప్రభుత్వము ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు విస్తృత ఏర్పాటు చేశారు. చెరువుల వద్ద లైటింగ్ లు బతుకమ్మ నిమజ్జనానికి చెరువుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. పోలీసులు బతుకమ్మ పండుగ కోసం పటిష్ట బందోబస్తు ట్రాఫిక్ ఆంక్షలు చర్యలు చేపట్టారు. గ్రామ గ్రామాన వాడవాడలో మహిళలు బతుకమ్మ ఆటపాటలతో డిజె సౌండ్ లతో బతుకమ్మ పాటలు సంతోషంగా ఆడారు.

వీపనగండ్లలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

ఆటపాటలు, కోలాటాలతో సందడిగా చివరి రోజు సంబరాలు

ప్రజా వాయిస్.. వీపనగండ్ల

వీపనగండ్ల మండల కేంద్రంలోని వివిధ కాలనీల్లో సద్దుల బతుకమ్మ వేడుకలను చివరి రోజు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు, చిన్నారులు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మలను పేర్చి సంప్రదాయ దుస్తుల్లో మహిళలు, యువతులు బతుకమ్మ పాటలు పాడుతూ, బొడ్డెమ్మలతో కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. అంబేద్కర్ కాలనీ, బీసీ కాలనీ, ప్రగతి నగర్, జగజీవన్ రామ్ కాలనీ, ఆదర్శ కాలనీల నుంచి మహిళలు, యువతులు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. పూల బతుకమ్మలతో మండల కేంద్రంలోని కాలనీలన్నీ పండుగ శోభను సంతరించుకున్నాయి. ఆటపాటలు, కోలాటాలతో చివరి రోజు సద్దుల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా ముగిశాయి.

దుబ్బాక నియోజకవర్గంలో తీవ్ర విషాదం..

కూడవెల్లి వాగులో పడి యువకుడు మృతి

దుబ్బాక, ప్రజా వాయిస్

సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు కూడవెల్లి వాగులో పడి ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయిన సంఘటన స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. వివరాల్లోకి వెళితే.. దుబ్బాక పట్టణానికి చెందిన పర్స కార్తీక్ (28) అనే యువకుడు ప్రమాదవశాత్తు కూడవెల్లి వాగులో పడిపోయాడు. అయితే ఈ దుర్ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఆదివారం సాయంత్రం ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ప్రమాదం జరిగిన తీరు, వాగులో పడటానికి దారితీసిన పరిస్థితుల పట్ల వాగు వద్దకు ఎందుకు వెళ్లాడనే అంశాలపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది. యువకుడు అకస్మాత్తుగా మృతి చెందడంతో పర్స కార్తీక్ కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. చేతికి అందివచ్చిన యువకుడు ఇలా విగతజీవిగా మారడంతో కుటుంబ సభ్యుల రోదనలు అందరినీ కలచివేస్తున్నాయి. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

బోథ్ ఎక్స్ రోడ్డు వద్ద సులాబ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ చేసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్.

చుట్టుపక్కల మండలాల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం

ప్రజా వాయిస్ బోథ్,ఆదిలాబాద్

జిల్లా లోని బోథ్ ఎక్స్ రోడ్డు వద్ద సులభ కాంప్లెక్స్ నిర్మాణానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ నిర్వహించారు. చుట్టుపక్కల మండలాల నుంచి బోథ్ ఎక్స్ రోడ్డుకు వచ్చే ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, వారికి మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారికి అవసరమైన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా ఈ సులాబ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. దీనివల్ల బోథ్ ఎక్స్ రోడ్డు మీదుగా ప్రయాణించే ప్రజలకు, చుట్టుపక్కల మండలాల నుంచి వచ్చే వారికి ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే బోథ్ ఎక్స్ రోడ్డు వద్ద రాత్రి వేళల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, రెండు రోజుల్లో హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు పనులు కూడా ప్రారంభమయ్యాయి. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు సంబంధిత పనులను ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రజా అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ బోథ్ ఎక్స్ రోడ్డు వద్ద మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమం లో బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్,సర్పంచుల సంఘం అధ్యక్షులు స్వామి, శ్రీధర్ రెడ్డి, గులాబ్, రూప్చంద్, సుజిల్, రాంచందర్,మరియూ అధికారులు ఉన్నారు

అమీన్పూర్ పెద్ద చెరువు వద్ద అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

వేడుకలను ఘనంగా నిర్వహించిన మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

చిన్నారుల కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలతో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

బతుకమ్మ పాటలు, జానపద గేయాలతో మార్మోగిన పెద్ద చెరువు పరిసరాలు

పటాన్ చెరువు ప్రజావాయిస్

తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ సంబరాలు అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని పెద్ద చెరువు వద్ద అంబరాన్నంటాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, మహిళల ఆటపాటలు, చిన్నారుల నృత్య ప్రదర్శనలతో చెరువు పరిసరాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. అమీన్‌పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తన సొంత నిధులతో, స్వయంగా ఆధ్వర్యం వహించి ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్య నృత్యాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళా బృందాలు ఆలపించిన బతుకమ్మ పాటలు, జానపద గేయాలతో పెద్ద చెరువు పరిసరాలు మార్మోగాయి. మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ పండుగ సంబరాల్లో మునిగితేలడంతో పెద్ద చెరువు వద్ద సందడి నెలకొంది. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, సంస్కృతీ సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. తెలంగాణ ప్రత్యేక సంస్కృతిని భావితరాలకు అందించడంతోపాటు చిన్నారుల్లో దాగి ఉన్న కళా ప్రతిభను ప్రోత్సహించాలనే సంకల్పంతో తన సొంత నిధులతో వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించే ఇలాంటి పండుగలను అందరూ కలిసికట్టుగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అమీన్‌పూర్ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, మాజీ కోఆప్షన్ సభ్యులు, మహిళలు, చిన్నారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీకృష్ణ నగర్ కాలనీలో అంగరంగ వైభవంగా బతుకమ్మ వేడుకలు

డీజే సప్పులతో హోరెత్తిన పూల పండుగ.. ఉత్సాహంగా పాల్గొన్న ఏరోప్లేన్ టీం సభ్యులు, నాయకులు

ప్రజా వాయిస్ కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణ నగర్ కాలనీలో బతుకమ్మ పండుగ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీకృష్ణ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజా బద్రుద్దీన్, జనరల్ సెక్రటరీ నాగరాజు చారి ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. డీజే సౌండ్లతో కాలనీ మారుమోగింది. సంగీతం, ఆటపాటల మధ్య మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొని పండుగ సంబరాలను మరింత ఘనంగా నిర్వహించారు. ఏరోప్లేన్ టీం సభ్యులందరూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ సంబరాల్లో భాగస్వాములయ్యారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ సూరారం డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, మన్నె రాజు , శ్రీశైలం వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు కాలనీవాసులతో కలిసి పండుగ సందడిని పంచుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను అందరూ కలిసికట్టుగా జరుపుకోవడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ఇటువంటి వేడుకలు ప్రజల మధ్య ఐకమత్యాన్ని, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కాలనీవాసులు, మహిళలు, ఏరోప్లేన్ టీం సభ్యుల ఉత్సాహభరితమైన భాగస్వామ్యంతో బతుకమ్మ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి.

తెలంగాణ బతుకమ్మ ప్రపంచానికే ఆదర్శం

- ఎమ్మెల్యే చింత ప్రభాకర్

ప్రజా వాయిస్ సంగారెడ్డి :

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను దేశంలో మరెక్కడా లేని విధంగా ప్రత్యేకంగా జరుపుకుంటామని, తెలంగాణలో నిర్వహించే బతుకమ్మ వేడుకలు ప్రపంచానికే ఆదర్శమని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లిలో కౌన్సిలర్ దశరథ్ రెడ్డి , 32వ వార్డు కౌన్సిలర్ అశ్విని నవీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. పూలను పూజించే గొప్ప సంస్కృతి, సంప్రదాయాలు తెలంగాణ ప్రజల సొంతమని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ పండుగకు ఎంతో విశిష్టత ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మహిళలు బతుకమ్మలు ఆడుతూ, పాటలు పాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, మల్లేశం, కౌన్సిలర్లు దశరథ్ రెడ్డి, పొన్న రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ మండలం గులాబ్‌తండా గ్రామంలో బతుకమ్మ పండుగ సంబరాలు

చాలా వైభవంగా జరుపుకున్న మహిళలు. గ్రామ పెద్దలు.

ప్రజా వాయిస్ బజార్ హత్నూర్.

ఆదిలాబాద్ జిల్లాలోని బజార్హత్నూర్ మండల కేంద్రంలోని గులాబ్ తండా లోని సద్దుల బతుకమ్మ వేడుకల్లో గ్రామ సర్పంచ్ రాథోడ్ లక్ష్మి బాయిూ, మాజీ సర్పంచ్ జాదవ్ విద్యాసాగర్, మరియు గ్రామ నాయకులు రాథోడ్ ధర సింగ్ పాల్గొన్నారు. వారితో పాటు ఉప సర్పంచ్ రాథోడ్ జ్ఞాన దేవ్, అంగన్‌వాడీ టీచర్ జాదవ్ సుశీల,గ్రామ పెద్దలు రాథోడ్ దన్ను కూడా ఈ సంబరాల్లో భాగస్వాములయ్యారు. గ్రామంలోని ఆడపడుచులు, అక్కాచెల్లెళ్లంతా ఒకచోటికి చేరి, రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ తిరుగుతూ, సాంప్రదాయ ఆటపాటలతో ఎంతో ఉత్సాహంగా, సంతోషంగా ఈ పండుగను జరుపుకున్నారు.

కీసరలో విచ్చలవిడిగా బెల్ట్ షాపుల మద్యం విక్రయాలు

బాలుడికే నేరుగా మద్యం క్వార్టర్ బాటిల్ విక్రయం ?

ఘట్కేసర్ ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణ ఏదీ?

ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌కు ఫోన్ చేసినా స్పందన లేదంటూ ఆరోపణలు ?

జిల్లాలో ఎక్సైజ్ శాఖ పనితీరుపై ప్రజల్లో చర్చ!

ప్రజావాయిస్, కీసర, ఘట్కేసర్ :

కీసర ప్రాంతంలో బెల్ట్ షాపుల పేరుతో మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే విమర్శల మధ్య, ఓ బాలుడికి నేరుగా మద్యం క్వార్టర్ బాటిల్ విక్రయించినట్లు వచ్చిన ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. మరోవైపు, ఈ వ్యవహారంపై సంబంధిత అధికారుల స్పందన ఎలా ఉందనే అంశం చర్చనీయాంశంగా మారింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తే జిల్లాలో ఎక్సైజ్ శాఖ పనితీరు ఎలా ఉందో అర్థమవుతోందని పలువురు విమర్శిస్తున్నారు.

బెల్ట్ షాపులపై పర్యవేక్షణ ఏదీ?

కీసర పరిసర ప్రాంతాల్లో బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులు లేని ప్రాంతాల్లో మద్యం విక్రయాలు సాగుతున్నాయా? అనుమతి పొందిన మద్యం దుకాణాల నుంచి ఇతర ప్రాంతాలకు మద్యం సరఫరా చేసి విక్రయిస్తున్నారా? అనే అంశాలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉంది. మద్యం విక్రయాలపై నిబంధనలు అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత ఎక్సైజ్ శాఖపై ఉంది. అక్రమ విక్రయాలపై ఫిర్యాదులు అందినప్పుడు వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి. అయితే, కీసర ప్రాంతంలో వినిపిస్తున్న ఆరోపణలపై అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నారా? అక్రమ మద్యం విక్రయాలను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

బాలుడికే మద్యం క్వార్టర్ బాటిల్ విక్రయం ?

ఈ వ్యవహారంలో అత్యంత ఆందోళన కలిగిస్తున్న అంశం బాలుడికి నేరుగా మద్యం క్వార్టర్ బాటిల్ విక్రయించినట్లు వచ్చిన ఆరోపణ. చిన్న వయసులోనే మద్యం అందుబాటులోకి వస్తే బాలల ఆరోగ్యం, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉంది. మైనర్లకు మద్యం అందకుండా చూడాల్సిన బాధ్యత విక్రయదారులతో పాటు సంబంధిత పర్యవేక్షణ వ్యవస్థపైనా ఉంది. అయినప్పటికీ, బాలుడికి మద్యం విక్రయించినట్లు ఆరోపణలు రావడం కలవరపెడుతోంది. ఈ ఘటన ఎక్కడ జరిగింది? బాలుడికి మద్యం విక్రయించిన వ్యక్తి ఎవరు? సంబంధిత విక్రయ కేంద్రానికి అనుమతి ఉందా? అనే అంశాలను అధికారులు విచారణ ద్వారా నిర్ధారించాలి. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌కు ఫోన్ చేసినా స్పందన లేదంటూ ఆరోపణలు ?

ఈ వ్యవహారంపై ఘట్కేసర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌ను ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ, ఆయన కాల్‌ను స్వీకరించలేదని సమాచారం అందించిన వ్యక్తి పేర్కొంటున్నారు ? ప్రజలకు సంబంధించిన సమస్యలపై అధికారులు స్పందించి, వాస్తవాలను పరిశీలించడం ఎంతో ముఖ్యం. ముఖ్యంగా బాలుడికి మద్యం విక్రయించినట్లు ఆరోపణలు వచ్చినప్పుడు సంబంధిత శాఖ స్పందించి విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. అయితే, ఇన్‌స్పెక్టర్ ఫోన్‌కు స్పందించకపోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ఆయన వివరణతో పాటు, కీసర ప్రాంతంలో అక్రమ మద్యం విక్రయాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఎక్సైజ్ శాఖ స్పష్టత ఇవ్వాల్సివుంది.

జిల్లాలో ఎక్సైజ్ శాఖ పనితీరుపై ప్రశ్నలు!

కీసరలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు, బాలుడికి మద్యం విక్రయించినట్లు వచ్చిన సమాచారం నేపథ్యంలో జిల్లా ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాల్సిన అధికారులు క్షేత్రస్థాయిలో ఎంతవరకు పర్యవేక్షణ చేస్తున్నారు? ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అనే అంశాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మద్యం విక్రయ కేంద్రాలను తనిఖీ చేసి, అనుమతులు లేని చోట విక్రయాలు జరుగుతున్నాయో లేదో పరిశీలించాలి. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా మైనర్లకు మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలను తీవ్రంగా పరిగణించి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలి.

ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందిస్తారా?

బాలల భవిష్యత్తు, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మద్యం విక్రయాలపై నిబంధనలు కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. కేవలం తనిఖీలకే పరిమితం కాకుండా, అక్రమ విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై స్పందించి, తీసుకున్న చర్యల వివరాలను వెల్లడించాలని కోరుతున్నారు...

మేకల కాపరులపై బీట్ అధికారి దాడి!

'వద్దు.. కొట్టొద్దు' అని వేడుకున్నా కనికరించలేదు.

తిరుపతిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి

తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం

ప్రజా వాయిస్ కోటపల్లి

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలో మేకలు మేపేందుకు అడవికి వెళ్లిన ఆదివాసీ మేకల కాపరులపై బొప్పారం బీట్ అధికారి తిరుపతి విచక్షణారహితంగా దాడి చేశారని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం ఆరోపించారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన ఆయన, బాధ్యుడైన అధికారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అడవిలో మేకలు మేపితే దాడి చేస్తారా?

కోటపల్లి మండలం ఆల్గామ గ్రామ పరిధిలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ఎర్మ పున్నం తెలిపారు. కార్తె సంతోష్, సంపత్, ఓజన్నలు మేకలను మేపేందుకు అడవిలోకి వెళ్లగా, మధ్యాహ్నం సమయంలో బొప్పారం బీట్ అధికారి తిరుపతి మరో ముగ్గురు సిబ్బందితో అక్కడికి వచ్చారని పేర్కొన్నారు. ఈ క్రమంలో సంతోష్, ఓజన్నలపై ఎలాంటి కారణం లేకుండా దాడి చేశారని ఆరోపించారు. వద్దని వేడుకున్నప్పటికీ పట్టించుకోకుండా దాడి చేయడం దారుణమని ఆయన అన్నారు. అంతేకాకుండా, ఈ విషయాన్ని కలెక్టర్‌కు చెప్పుకుంటావా, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో, నీకు దిక్కున్న చోట చెప్పుకో అంటూ అధికారి బెదిరించినట్లు బాధితులు తెలిపారని పేర్కొన్నారు. తనను ఎవరూ ఏమీ చేయలేరన్న ధోరణిలో వ్యవహరించడం అధికార దుర్వినియోగానికి నిదర్శనమని ఎర్మ పున్నం విమర్శించారు.

తీవ్రంగా గాయపడ్డ బాధితులు

బాధితుల తొడలు, చేతులు, నడుము ప్రాంతాల్లో దెబ్బలు తగలడంతో సంతోష్, ఓజన్నలు సరిగా నడవలేని పరిస్థితి ఏర్పడిందని ఎర్మ పున్నం తెలిపారు. అడవిపై ఆధారపడి జీవనం సాగించే ఆదివాసీ గిరిజనుల పట్ల అటవీ అధికారులు కక్షపూరితంగా వ్యవహరించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మేకలను మేపుకునేందుకు వెళ్లిన పేద గిరిజనులపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

మేకల కాపరులపై దాడికి పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బొప్పారం బీట్ అధికారి తిరుపతిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి, సమగ్ర విచారణ జరిపి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎర్మ పున్నం డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై అధికారులు తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కొమురం సమ్మయ్య, మడే రామచంద్రు, మధునయ్య, శంకర్, బాపు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లోని 'ఫోర్ ఫాదర్స్' పబ్‌కు రూ.20 వేల జరిమానా.. కారణం ఇదే!

హైదరాబాద్ మహానగరంలో తాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టే దిశగా జలమండలి కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్‌లోని ఓ ప్రముఖ పబ్‌పై భారీ జరిమానా విధించడంతో పాటు, నీటి కనెక్షన్‌ను తొలగించి తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. నీటి వృథా విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఈ చర్యల ద్వారా స్పష్టం చేసింది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లో ఉన్న 'ఫోర్ ఫాదర్స్ పబ్' తాగునీటిని విపరీతంగా దుర్వినియోగం చేస్తున్నట్లు జలమండలికి ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన విజిలెన్స్ అధికారులు, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. పబ్‌లో నీటిని వృథా చేస్తున్నట్లు తనిఖీల్లో నిర్ధారణ కావడంతో, యాజమాన్యానికి రూ. 20 వేల జరిమానా విధించారు. అంతటితో ఆగకుండా, ఆ పబ్ తాగునీటి కనెక్షన్‌ను శాశ్వతంగా తొలగించారు. అంతేకాక, జలమండలి ఫిల్లింగ్ స్టేషన్ల నుంచి కమర్షియల్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను కూడా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

వేసవి దృష్ట్యా కఠిన చర్యలు.. ప్రజలకు విజ్ఞప్తి

వచ్చే ఏడాది వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకే ఈ కఠిన చర్యలు చేపట్టినట్లు జలమండలి స్పష్టం చేసింది. ప్రతి నీటి చుక్కనూ పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లు వంటి వాణిజ్య సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నీటి వృథాకు పాల్పడితే ఇలాంటి చర్యలే కొనసాగుతాయని హెచ్చరించింది. నీటి సంరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని జలమండలి కోరింది.

ఎక్కడైనా తాగునీటి దుర్వినియోగం జరుగుతున్నట్లు గమనిస్తే, ఫొటోలు లేదా వీడియోలతో సహా పూర్తి వివరాలను వాట్సాప్ నంబర్ 99499 30003కు పంపాలని సూచించింది. లేదా కస్టమర్ కేర్ నంబర్ 155313కు కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చింది.

ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పండుగ సందడి..

వేడుకలకు హాజరైన నందమూరి సుహాసిని

ప్రజా వాయిస్ హైదరాబాద్ డెస్క్

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు హైదరాబాద్‌లోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కార్యాలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకలకు నందమూరి సుహాసిని హాజరయ్యారు. బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను చాటుతూ నిర్వహించిన సంబరాల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ సంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తూ పండుగ శోభను తీసుకొచ్చారు. పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ చేరి మహిళలు సంప్రదాయ పాటలు, ఆటలతో వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంతో, ప్రకృతి ఆరాధనతో ముడిపడిన ప్రత్యేకమైన పండుగ. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, వాటిని గౌరమ్మగా భావించి పూజించడం ఈ పండుగ ప్రత్యేకత. మహిళల ఐక్యతకు, కుటుంబాల మధ్య ఆత్మీయతకు, తెలంగాణ సాంస్కృతిక వైభవానికి బతుకమ్మ వేడుకలు ప్రతీకగా నిలుస్తాయి. ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో నిర్వహించిన ఈ వేడుకలు తెలంగాణ సంప్రదాయాల పట్ల ఉన్న అభిమానాన్ని చాటిచెప్పాయి. పండుగ సంబరాలతో కార్యాలయ ప్రాంగణం సందడిగా మారింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని పలువురు పేర్కొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతను, పూల పండుగ ప్రత్యేకతను ప్రతిబింబించేలా ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో బతుకమ్మ వేడుకలు ఘనంగా ముగిశాయి.

కన్నేపల్లి లక్ష్మీ పంపుహౌస్‌ను సందర్శించనున్న కల్వకుంట్ల కవిత

సోమవారం ఉదయం 11 గంటలకు కాళేశ్వరం ప్రాజెక్టు పరిశీలన..

అనంతరం మీడియాతో మాట్లాడనున్న తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు..

ప్రజా వాయిస్ భూపాలపల్లి

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నేపల్లి (లక్ష్మీ) పంపుహౌస్‌ను తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోమవారం సందర్శించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కన్నేపల్లి పంపుహౌస్‌ను ఆమె పరిశీలించనున్నారు. సోమవారం ఉదయం 10.45 గంటలకు కన్నేపల్లి పంపుహౌస్ వద్దకు కల్వకుంట్ల కవిత చేరుకోనుండగా, ఉదయం 11 గంటలకు పంపుహౌస్‌ను సందర్శించనున్నారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన లక్ష్మీ పంపుహౌస్ పరిస్థితులను పరిశీలించడంతో పాటు, గోదావరి నదిలో ప్రవాహాన్ని కూడా ఆమె పరిశీలించనున్నారు. పంపుహౌస్ సందర్శన, గోదావరి ప్రవాహ పరిశీలన అనంతరం కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడనున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై ఆమె తన అభిప్రాయాలను వెల్లడించే అవకాశం ఉంది. ఆమె పర్యటనపై రాజకీయ, స్థానిక వర్గాల్లో ఆసక్తి నెలకొంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నేపల్లి పంపుహౌస్ తెలంగాణ సాగునీటి వ్యవస్థలో కీలకమైనది కావడంతో ఈ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది.

సీఈసీకి వ్యతిరేకంగా విదేశాల్లో నిరసనలు

డెస్క్:

భారత చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారత సంతతి ప్రజలు ఆయా నగరాల్లో వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. 'జంతర్‌మంతర్ ఎవరీ వేర్' పేరిట శని, ఆదివారాల్లో లండన్, జర్మనీలోని ఎర్లన్‌జెన్, గాటిన్‌జెన్, బెర్లిన్, నెదర్లాండ్స్‌లోని హేగ్, స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్, ఫిన్‌ల్యాండ్‌లోని హెల్సింకి, కెనడాలోని టొరాంటో, వాంకోవర్, మాంట్రియల్, అమెరికాలోని ఆస్టిన్, ఫిలడెల్ఫియా, లాస్ ఏంజిలిస్, షికాగో, జెక్ రిపబ్లిక్‌లోని ప్రేగ్‌లలో వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు నిర్వహించారు. సిడ్నీ, మెల్‌బోర్న్, బ్రిస్బేన్, న్యూయార్క్ నగరాలలోనూ ప్రదర్శనలు నిర్వహించారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి..

గవర్నర్‌ను కలిసిన జగన్

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను కోరారు. ఆదివారం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార కూటమి అప్రజాస్వామిక పద్ధతులకు పాల్పడుతోందని, ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు.సమావేశం అనంతరం జగన్ మీడియాలో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంతటి అప్రజాస్వామిక వాతావరణాన్ని తానెప్పుడూ చూడలేదని అన్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం కేంద్ర బలగాల పర్యవేక్షణలో, సీసీటీవీ కెమెరాల నిఘాలో జరిపేలా చూడాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. వైసీపీ అభ్యర్థులను నామినేషన్ కేంద్రాల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, అదే సమయంలో టీడీపీ మద్దతుదారులను లోపలికి అనుమతించి దాడులు చేయిస్తున్నారని గవర్నర్‌కు వివరించినట్లు చెప్పారు. ఈ అరాచకాలకు పోలీసులు కూడా అధికారపక్షానికే మద్దతుగా నిలుస్తున్నారని ఆరోపించారు.రాష్ట్రంలోని 8 ప్రాంతాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని, మరో 19 చోట్ల కేవలం 36 శాతం నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకో 8 ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను చించివేశారని తెలిపారు. పులివెందులలో 36 వార్డులకు గాను కేవలం 19 నామినేషన్లు మాత్రమే దాఖలు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ ఎంపీలు అవినాశ్ రెడ్డి, మిథున్ రెడ్డి, గురుమూర్తి పట్ల వ్యవహరించిన తీరు, అభ్యర్థులపై పోలీసుల కాల్పులు, తప్పుడు కేసులు బనాయించడం వంటి అంశాలను కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.క్రియాశీలకంగా ఉన్న వైసీపీ కార్యకర్తలను భయపెట్టేందుకు బైండోవర్ కేసుల కుట్ర జరుగుతోందని జగన్ ఆరోపించారు. "ఓటమి భయంతోనే చంద్రబాబు ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నారు. పోటీ చేయాలనుకునేవారికి అవకాశం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ. దీనిపై న్యాయపరమైన మార్గాలతో సహా అన్ని అవకాశాలను అన్వేషిస్తాం" అని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులు ధైర్యంగా పోరాడాలని, త్వరలోనే పరిస్థితులు మారతాయని ఆయన పిలుపునిచ్చారు.

ఈసీల నియామకంపై తప్పుచేశాం: పశ్చాత్తాపం వ్యక్తం చేసిన జగన్

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ), ఇతర కమిషనర్ల నియామకం కోసం కేంద్ర ప్రభుత్వం 2023లో తీసుకొచ్చిన చట్టానికి అప్పట్లో మద్దతివ్వడం తాము చేసిన పెద్ద తప్పిదమని, అందుకు ఇప్పుడు చింతిస్తున్నామని జగన్ విచారం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న పార్టీయే ఎన్నికల కమిషనర్లను నియమించే ప్రక్రియను నియంత్రించకూడదని, ఈ విధానంపై ఇప్పుడు పశ్చాత్తాపం చెందుతున్నామని ఆయన అన్నారు. అంతకుముందు ఎస్ఈసీ అనిల్ పునేఠాను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ జగన్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.కేంద్రంలో అయినా, రాష్ట్రంలో అయినా ఎన్నికల కమిషనర్లను అధికార పార్టీ నామినేట్ చేయకూడదని జగన్ స్పష్టం చేశారు. "గతంలో కేంద్రంలో అధికార పార్టీయే ఎన్నికల కమిషనర్‌ను నామినేట్ చేసే విధానానికి వైసీపీ మద్దతు ఇచ్చింది. కానీ ఆ రోజు మేము చేసిన తప్పుకు ఇప్పుడు బాధపడుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు. "పరీక్ష రాసే విద్యార్థే తనకు ఇన్విజిలేటర్‌ను నియమించుకున్నట్లుగా ఈ విధానం ఉంది. ఎంత నిజాయతీపరుడైన అధికారి అయినా, నియామకం నిష్పక్షపాతంగా జరగనప్పుడు విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుంది" అని జగన్ అభిప్రాయపడ్డారు.ప్రస్తుత నియామక పద్ధతిలో లోపాలున్నాయని జగన్ వివరించారు. ఈ విధానంలో ప్రధానమంత్రి, ఆయన నామినేట్ చేసిన మరో మంత్రికి రెండు ఓట్లు, ప్రతిపక్ష నేతకు ఒక ఓటు ఉంటుందని, దీంతో ప్రభుత్వానికి అనుకూలమైన వ్యక్తే కమిషనర్‌గా నియమితులవుతారని తెలిపారు. ఈ వ్యవస్థలో ఉన్న లోపాన్ని తాము తప్పు చేసిన తర్వాతే గ్రహించామని అన్నారు. ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను కాపాడటానికి పాత పద్ధతినే పునరుద్ధరించాలని, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ), ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేతతో కూడిన కమిటీ ద్వారానే ఈసీలను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. కమిటీలో సీజేఐ ఉండటం వల్ల నియామక ప్రక్రియ నిష్పక్షపాతంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నియామకంలో కూడా ఇదే తరహా సంస్కరణలు తీసుకురావాలని జగన్ కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లేదా టీడీపీ ప్రభుత్వం ఎస్ఈసీని నియమించకూడదని ఆయన స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అధికార టీడీపీ కూటమి అడ్డుకుంటోందని ఆరోపిస్తూ, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాను కలిసి ఫిర్యాదు చేసిన అనంతరం జగన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత ఎస్ఈసీని ముఖ్యమంత్రి చంద్రబాబే నియమించారని, ఆయన ఆదేశాల మేరకే ఎస్ఈసీ పనిచేస్తున్నారని జగన్ ఆరోపించారు.

ఘనంగా దుర్గాదేవి మండపం వద్ద నాట్య ప్రదర్శన

ప్రజా వాయిస్ బోథ్ ఆదిలాబాద్

జిల్లాలోని బోథ్ నియోజక వర్గం కేంద్రం లోని దుర్గా కమిటీ – బోథ్ వారి ఆధ్వర్యంలో లో నిర్వహించిన కూచిపూడి – భరతనాట్య ప్రదర్శన కనులవిందుగా జరిగింది. దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక వేదికపై జరిగిన కూచిపూడి మరియు భరత నాట్య ప్రదర్శన భక్తులను కళాభిమానులను విశేషంగా అలరించింది .ఇవి మాత్రమే కాకుండా ఇతర సాంప్రదాయ నృత్య ప్రదర్శన అత్యంత వైభవంగా సాగింది.మొదట విగ్నేశ్వరుని ప్రార్థనతో ప్రారంభమై ఒక్కొక్క నాట్య ప్రదర్శన ఒక్కో సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పారు.అందులో భాగంగా అమ్మవారి నవరాత్రి విశేషాలు దుర్గాదేవి మహిమలు సమాజం లో భారతీయ మహిళ యొక్క ఉన్నతిమహిషాసుర మర్దిని రూప ప్రదర్శన లో పిల్లలు అమ్మవారిని సాక్షాత్కరించిన విధము అధ్యంతం ఆసక్తికరంగా జరగడమే కాకుండా చెడు పై మంచి సాధించే విజయాన్ని చాటి చెప్పడం చూపరులని ఎంతో ఆకట్టుకుంది. కళాకారులు ప్రదర్శించిన శివాష్టకం మరియు కూచిపూడి నృత్య విశిష్టత అయినా తరంగం నృత్యం వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది చప్పట్లతో వేదిక మార్మోగింది. కార్యక్రమం ముగింపులో దుర్గా కమిటీ నిర్వాహకులు నాట్యం చేసిన విద్యార్థులందరిని ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ యొక్క కార్యక్రమానికి విచ్చేసిన వందలాది మంది భక్తులు ఈనాటి ఉత్సవాన్ని వీక్షించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు

పండుగ పూట కరెంట్ కోతలు.. చీకట్లోనే బతుకమ్మ సంబరాలు!

జయ్యారంలో విద్యుత్ అంతరాయంతో మహిళల ఇబ్బందులు.. అధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం

ప్రజా వాయిస్ చిన్నగూడూరు,

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేళ కూడా విద్యుత్ కోతలు తప్పకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలంలోని జయ్యారం గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకల సమయంలో విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో ఆడపడుచులు చీకట్లోనే బతుకమ్మ ఆడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.పూలను పేర్చి అందంగా బతుకమ్మలను సిద్ధం చేసుకున్న మహిళలు, సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. అయితే పండుగ సమయంలో కరెంట్ లేకపోవడంతో వేడుకలకు అంతరాయం ఏర్పడింది. చీకట్లోనే బతుకమ్మ పాటలు పాడుతూ మహిళలు సంబరాలను కొనసాగించారు.పండుగల సమయంలోనైనా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. పండుగ పూట కూడా కరెంట్ కష్టాలు తప్పకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని, ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.పండుగ వేళ ప్రజలకు అసౌకర్యం కలగకుండా విద్యుత్ సరఫరాపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జయ్యారం గ్రామస్తులు కోరుతున్నారు.

సీఎం రేవంత్‌కు బండ్ల గణేశ్ విజ్ఞప్తి

పౌల్ట్రీ పరిశ్రమ ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై తక్షణమే స్పందించి, రైతులను ఆదుకోవాలని ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఈరోజు ఆయన ముఖ్యమంత్రిని ఉద్దేశించి ఒక ప్రకటన చేశారు.పౌల్ట్రీ పరిశ్రమకు కీలకమైన మొక్కజొన్న, సోయాబీన్, డీఓసీ వంటి ముడిసరుకులను కొందరు స్టాకిస్టులు అక్రమంగా గోదాముల్లో నిల్వ చేస్తున్నారని బండ్ల గణేశ్ ఆరోపించారు. దీనివల్ల మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించి, ధరలను అమాంతం పెంచుతున్నారని ఆయన పేర్కొన్నారు. "ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోవాలి. పౌల్ట్రీ రంగానికి, రైతులకు న్యాయం జరిగేలా చూడాలి" అని ఆయన కోరారు.ఇప్పటికే అనేక ఆర్థిక, సాంకేతిక సమస్యలతో సతమతమవుతున్న పౌల్ట్రీ రైతులకు ఈ ధరల పెరుగుదల అదనపు భారంగా మారిందని బండ్ల గణేశ్ తెలిపారు. సంబంధిత అధికారులతో ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసి, రైతులకు సరసమైన ధరలకు, సకాలంలో ముడిసరుకులు అందేలా చూడాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణ పౌల్ట్రీ రైతుల తరఫున తాను ఈ విజ్ఞప్తి చేస్తున్నానని, ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకోవాలని ఆయన అన్నారు.